ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 16 మార్చి 2025





• వెంకటపాలెంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న వేంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవం

మంగళసూత్రాన్ని చూపిస్తున్న వేద పండితులు

అమరావతి ఆధ్యాత్మిక నగరి

- అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణం
- గోవిందనామస్మరణతో మార్మోగిన వెంకటపాలెం
- పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు దంపతులు
- కల్యాణోత్సవానికి గవర్నర్ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు రాజధాని వాసులు హాజరు

గోవింద నామస్మరణలు.. అన్నమయ్య సంకీర్తనలతో భక్తుల తన్మయత్వం.. భక్తుల కోలాటాలు.. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో రాజధాని అమరావతి ఆధ్యాత్మికనగరంగా మారిపోయింది. విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా వెలుగులీనుతుండగా రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి సప్త ద్వారాలు, ఆనంద నిలయంతో వైకుంఠాన్ని తలపించేలా టీటీడీ కల్యాణ వేదిక ఏర్పాటు చేయగా రంగు రంగుల పుష్పాలు, ఫలాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితుల ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం జరగ్గా ఆహుతులు తిలకించి పరమానందభరితులయ్యారు.

తుళ్లూరు, గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గోవిందా.. గోవింద.. ఏడుకొండల వాడా వేంకటరమణా గోవిందా.. అంటూ భక్తులు వెంకన్న నామాలను స్మరిస్తుండగా.. అత్యద్భుత అలంకరణలతో ఇల వైకుంఠం తిరుమలను రాజధాని అమరావతిలో ప్రతిష్ఠించారా అన్నట్లు జరిగిన ఏర్పాట్లు, అలంకరణల మధ్య వెంకటపాలెం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. టీటీడీ ఆధ్వర్యంలో ఆ దేవ దేవుడి కల్యాణ మహోత్సవం అమరావతి రాజధానిలో తొలిసారి అంగరంగ వైభవంగా జరిగింది. అన్నమాచార్య సంకీర్తనలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య శ్రీనివాసుడి కల్యాణం రాజధాని ప్రజలకు కొత్త అనుభూతిని పంచిపెట్టింది. శ్రీవారి కల్యాణ వేదిక విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా విరాజిల్లింది. కల్యాణోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఆద్యంతం భక్తి భావంతో తన్మయత్వం పొందారు. తొలుత ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం మంగళవాయిద్యాల నడుమ సతీసమేతంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ నజీర్‌తో కలసి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు పట్టు వస్త్రాలు తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ వేదపండితులు కల్యాణ వేడుక కైంకర్యాలను నిర్వహించారు. చివరగా కర్పూర హారతి, నక్షత్ర హారతి, మహా హారతితో కల్యాణోత్సవం అత్యంత ఘనంగా ముగిసింది. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరి నారాయణ, కొల్లు రవీంద్ర, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, టీటీడీ ఈవో శ్యామల రావు, ఏఈవో వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, తమ్మిశెట్టి జానకీదేవి, ఎంఎస్ రాజు, భానుప్రకాశ్, కలెక్టర్ నాగలక్ష్మి అమరావతిలోని వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు.



స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు



స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తున్న ప్రజలు





స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, కలెక్టర్ నాగలక్ష్మి

మంగళగిరిని.. నెంబర్ 1గా తీర్చిదిద్దుదాం

- అభివృద్ధికి పారిశుధ్య కార్మికులు సహకరించాలి
- 11 వేల మందికి దశల వారీగా పట్టాల పంపిణీ
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి లోకేశ్

మంగళగిరి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దేశంలోనే మంగళగిరిని నెంబర్ 1 కార్పొరేషన్‌గా తీర్చిదిద్దే విషయంలో పారిశుధ్య కార్మికులు సహకరించాలని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మంగళగిరిలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. రూ.90 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన పారిశుధ్య పనిముట్లను పరిశీలించారు. అనంతరం ఆల్ఫా టీ స్టాల్ వద్ద ఆయన పారిశుధ్య కార్మికులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ఉండి.. పనిచేసుకుంటూ మంగళగిరిని మనమే అభివృద్ధి చేసుకుందామని పిలుపిచ్చారు. తమకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని మంత్రికి కార్మికులు ఫిర్యాదు చేశారు. మరుగుదొడ్లు, పక్కా గృహాలు, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని, ఐడీ కార్డులను పంపిణీ చేయాలన్నారు. కార్మికులందరికీ ప్రభుత్వ పథకాలన్నీ వర్తించేలా తాను ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ సంజీవని ద్వారా వైద్యసాయాన్ని అందిస్తామన్నారు.

ప్రతి ఆరుమాసాలకు ఒకసారి..

ఇకమీదట ప్రతి ఆరుమాసాలకు ఒకసారి కలుసుకుని సమస్యలను మనమే పరిష్కరించుకుందామని లోకేశ్ పారిశుధ్య కార్మికులకు తెలిపారు. నియోజకవర్గంలో 11 వేల మందికి దశల వారీగా నివేశన పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. పట్టాల పంపిణీ తర్వాత ఇళ్లు లేనవారికి ఇళ్లను కూడా నిర్మించే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. టిడ్కో గృహ సముదాయాల్లోని సమస్యల పరిష్కారంపై దృష్టి పెడుతున్నామన్నారు. నియోజకవర్గంలో గంజాయి నియంత్రణకు యుద్ధం చేస్తున్నామని చెప్పారు. భూగర్భ డ్రెయినేజీ, అండర్ వాటర్, గ్యాస్ లైన్ల పనులను జూన్‌లో ప్రారంభించి ఏడాదిన్నరలోగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనరు షేక్ అలీంబాషా, ఏసీ కుంతల, డీసీ శ్రీకాంత్, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, చేనేత కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నేతలు దామర్ల రాజు, తోట పార్థసారథి, గోవాడ దుర్గారావు, కారంపూడి అంకమ్మరావు, వింజమూరి ఆశాబాల, ఆకుల జయసత్య తదితరులు పాల్గొన్నారు.

మేయర్ పీఠంపై కూటమి కన్ను

- ఏడాది పాటు ఉండే పదవి నానీకి దక్కే చాన్స్
- గత ఎన్నికల్లో ఆయనే మేయర్ అభ్యర్థిగా బరిలో
- టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరిస్తున్న కోవెలమూడి
- కావటి మనోహర్ రాజీనామాతో సులువు కానున్న విజయం
- తాత్కాలిక మేయర్ స్థానం డిప్యూటీ మేయర్ సజీలను వరించేనా?

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎవరూ ఊహించని విధంగా వైసీపీ నేత కావటి మనోహర్ నాయుడు తన మేయర్ పదవికి రాజీనామా చేశారు. దీంతో నగరపాలక సంస్థ రాజకీయం కొత్త మలుపునకు తెరలేచింది. వాస్తవానికి కావటి పదవీ కాలం మరో ఏడాది ఉన్నప్పటికీ ఈ నెల 18తో నాలుగేళ్ళు నిండుతుంది. వైసీపీ మంచి మెజార్టీతో మేయర్ పీఠాన్ని దక్కించుకున్నా గత ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో ఆ పార్టీ కార్పొరేటర్ల సంఖ్య క్రమేణా క్షీణించింది. కార్పొరేషన్‌లో వైసీపీ బలం 21కి దిగజారిపోగా టీడీపీ బలం 29, జనసేన 6కు చేరాయి. దీంతో ఈ నెల 18 తర్వాత మేయర్‌పై అవిశ్వాసం ప్రకటించేందుకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు రంగం సిద్ధం చేశారు. అయితే 2/3వ వంతు సభ్యులకు మరో నలుగురైదుగురు కార్పొరేటర్ల అవసరం ఉండగా వారిని వైసీపీ నుంచి కూటమిలోకి లాక్కునే ప్రయత్నాలు జరుగుతుండగానే మేయర్ కావటి హఠాత్తుగా పదవి నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారు. దీంతో 2/3 వంతు మెజార్టీతో పనిలేనందున ఇప్పుడున్న బలంతోనే సులువుగా కూటమి తరఫున మేయర్‌ను ఎన్నుకునే అవకాశం వచ్చింది. కలెక్టర్ ఎన్నికల కమిషన్ అనుమతితో నోటిఫికేషన్ జారీ చేసి కొత్త మేయర్‌ను ఎన్నుకునే ప్రక్రియ తక్షణమే ప్రారంభించవచ్చు. అయితే ఈలోగా కూటమి ప్రజా ప్రతినిధులు సూచిస్తే తాత్కాలిక మేయర్‌గా ప్రస్తుతం డిప్యూటీ మేయర్‌గా వ్యవహరిస్తూ టీడీపీ పక్షాన ఉన్న షేక్ సజీల కొద్ది రోజులు ఆ పీఠాన్ని అధిష్ఠించే అవకాశం వస్తుంది.

ఖంగుతిన్న వైసీపీ నేతలు..

మేయర్ పదవి నుంచి మనోహర్ హఠాత్తుగా తప్పుకోవడంతో వైసీపీ ముఖ్య నేతలు ఖంగుతిన్నారు. జిల్లా అధ్యక్షుడైన మాజీ మంత్రి అంబటి రాంబాబుకు తలకొట్టినంత పనైంది. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో బలం లేకపోయినా వైసీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని అంబటి ప్రయత్నించి భంగపడ్డారు. ఈ క్రమంలో తనపై పెట్టే అవిశ్వాసాన్ని ఎదుర్కొని నిలబడలేనని ముందే ఊహించిన కావటి రాజీనామా చేశారని తెలుస్తోంది. ఇప్పటికే ఆయనకు గన్‌మన్, అటెండర్, సీసీలు, బంట్రోతులను కార్పొరేషన్ అధికారులు తొలగించారు. ఈ క్రమంలో మేయర్ పదవిలో కొనసాగడం కోసం పోరాటం చేయడం అనవసరమని రాజీనామా చేశారని సమాచారం.



మేయర్ పీఠం

నానీకే అవకాశం?

ఇక ఏడాది పాటు ఉండే మేయర్ పదవి టీడీపీ సీనియర్ నేత కోవెలమూడి రవీంద్ర(నాని)కే దక్కే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం ఆయనే నగరపాలక సంస్థలో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరిస్తున్నారు. పైగా గత నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఆయనే టీడీపీ తరఫున మేయర్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. కూటమిలో భాగంగా ఉన్న కొద్దిమంది కార్పొరేటర్లు నానీ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించినా గతంలో ఆయనకు ఇచ్చిన హామీ మేరకు టీడీపీ అధిష్ఠానం మేయర్ పీఠంపై కూర్చోపెట్టే అవకాశం ఉంది.



సమావేశం నుంచి వెళ్లిపోతున్న జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా

జడ్పీటీసీలు.. బాయ్‌కాట్

- 82 మందికి 13 మంది జడ్పీటీసీలే హాజరు
- కోరం లేకపోవడంతో వాయిదా వేసిన చైర్‌పర్సన్
- ఆమోదానికి నోచుకోని బడ్జెట్.. ఏప్రిల్ నుంచి తిప్పలే
- వైసీపీ జడ్పీటీసీల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- క్రిస్టీనా టీడీపీలో చేరినప్పటి నుంచి సహాయ నిరాకరణ

గుంటూరు సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జగన్ అసెంబ్లీకి పోవడంలేదు.. తాము మాత్రం జడ్పీ సమావేశానికి ఎందుకు వెళ్లాలి.. అనుకున్నారో ఏమో జడ్పీటీసీలు శనివారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపులో కీలకమైన సమావేశాన్ని వైసీపీ జడ్పీటీసీలు బహిష్కరించారు. జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ఒకటో స్థాయి సంఘ సమావేశం ప్రారంభం కాగా జడ్పీ టీసీలు ఆలస్యంగా వచ్చారు. అయితే కోరం సరిపోవడంతో సమావేశాన్ని నిర్వహించారు. మిగిలిన స్థాయి (మిగతా 8వ పేజీలో)



సమావేశం వాయిదాతో హాల్ నుంచి వెళ్లిపోతున్న అధికారులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.23 (ఆదివారం సాయంత్రం) | సహరి : 4.58 సోమవారం ఉదయం

ప్రభుత్వాస్పత్రిలో ప్యాప్-డీ సెంటర్ ఏర్పాటు

● రాష్ట్రంలో ఈ తరహా కేంద్రం ఇదే మొదటిసారి

గుంటూరు మెడికల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఓపీ విభాగంలో.. ఔషధాలు వాడే విధానంపై రోగులకు అవగాహన కల్పించేందుకు శనివారం కొత్తగా ప్యాప్-డీ సెంటర్‌ను (పేషెంట్ ఏవేర్‌నెస్ ఆన్ ప్రిస్క్రైబ్డ్ డ్రగ్స్) ప్రారంభించారు. ఆసుపత్రి ఓపీ విభాగంలో ఆరవ నెంబర్ వార్డులో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక కార్పొరేటర్ పోతురాజు సమతతో కలసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగానికి అనుబంధంగా పని చేసే ఈ కేంద్రంలో ఫార్మసిస్టులు, మందులు వాడే విధానం రోగులకు వివరిస్తారు. ఈ సందర్భంగా గుంటూరు వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యబోధన ఆసుపత్రుల్లో తొలిసారిగా గుంటూరు జీజీహెచ్‌లో ప్యాప్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోగులు ఒకే మందును పలుసార్లు తీసుకోకుండా నివారిస్తామన్నారు. కార్యక్రమంలో జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందచారాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ సాల్మన్‌రాజు, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ బీ సతీష్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



ప్యాప్‌డీ సెంటర్ ప్రారంభిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

◆ సెల్‌ఫోన్ మాట్లాడుతూ ట్రక్ ఆటోను ఢీకొన్న ద్విచక్ర వాహనం

◆ అక్కడికక్కడే మృతి చెందిన వ్యక్తి ◆ మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

వేమూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై అతి వేగంతో వెళుతూ.. ఫోన్ మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న ట్రక్ ఆటోను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం మధ్యాహ్నం ఈ సంఘటన వేమూరు-తెనాలి ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. తెనాలి మండలం కొలివరం గ్రామానికి చెందిన బత్తిభట్ల శ్రీధర్ (28) గుంటూరు మంగళదాస్ నగర్‌కు చెందిన తోట సోముకుమార్‌లు ద్విచక్ర వాహనంపై కొల్లూరు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. వాహనాన్ని నడుపుతున్న శ్రీధర్ అతి వేగంతో నడపడంతో పాటు సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న టాటా ఏసీని ఢీకొట్టాడు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో శ్రీధర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సోముకుమార్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ సంఘటన చోటు చేసుకోగానే సమీపంలోని వ్యక్తులు 108 వాహనానికి ఫోన్ చేయగా రెండు గంటల వరకు అందుబాటులోకి రాకపోవడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన శ్రీధర్‌ను పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయాలపాలైన సోముకుమార్‌ను చికిత్స నిమిత్తంగా ఆటోలో తెనాలి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి కృష్ణ తెలిపారు.

మధ్యవర్తిత్వంతోనే వివాదాల పరిష్కారం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి

పెదకాకాని, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కోర్టు గుమ్మం తొక్కకుండానే ప్రత్యామ్నాయ విధానాల ద్వారా వివాదాల పరిష్కారం చౌకగా, సత్వర న్యాయం పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి అన్నారు. శనివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏషియన్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సంస్థతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ చీమలపాటి రవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులందరూ వీలైనంతవరకు స్నేహపూర్వకమైన విధానాల ద్వారా ముఖ్యంగా చట్టప్రకారమైన ఆర్బిట్రేషన్ అనగా మధ్యవర్తిత్వపు పద్ధతిలో కోర్టు వెలుపల వివాదాలను పరిష్కరించుకుంటే మెరుగైన ఫలితాలు ఉంటాయని సూచించారు. న్యాయ విద్యార్థులు అన్ని రంగాల వలే వారి రంగంలో కూడా నూరు శాతం విజయం సాధించే అవకాశాలు ఉన్నాయన్నారు. అయితే క్రమశిక్షణ, సహనం వంటి లక్షణాలతో శ్రమించాలని పిలుపునిచ్చారు. గతంలో ప్రజల్లో నిజాయితీ, సోదర భావాలు ఉండటం కారణంగా గ్రామ పెద్దల తీర్పులతో వివాదాలు సత్వరమే పరిష్కారం అయ్యేవన్న సంగతిని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు మారిన కాలమానం ప్రకారం మనలో కోరికలు అధికమై అహంతో ప్రతిదీ లిటిగేషన్‌కే ప్రాధాన్యమిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా పరిష్కారం కానీ కేసుల సంఖ్య ఐదు కోట్లను దాటిపోవడం మనందరినీ భయభ్రాంతులకు గురి చేసే విషయంగా చెప్పుకొచ్చారు. గౌరవ అతిథి సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది ఆర్.శాంతన కృష్ణన్ మాట్లాడుతూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యాయవిద్యలో ఆర్బిట్రేషన్‌ను ఒక సబ్జెక్టుగా తీసుకువచ్చి ఈ సమాజానికి ఎంతో మేలు చేస్తుందని కొనియాడారు. అయితే కేంద్రం మీడియేషన్ చట్టాన్ని 2023లో తీసుకువచ్చినప్పటికీ అమలుకు శ్రీకారం చుట్టుకపోవడం ఎంతో విచారకరమని అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ కె.గంగాధర్ రావు మాట్లాడుతూ తమ తాతల కాలంలో రచ్చబండ విధానంలో ముత్తాత మరియు తాత ఆ గ్రామస్తుల వివాదాలని పరిష్కరిస్తుంటే తద్వారా తన కుటుంబానికి దక్కిన కీర్తిని అనుభవిస్తూ తాము చాలా గర్వించేవారమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీఐఏఎం కో ఫౌండర్ డాక్టర్ సూర్యరాజు, వర్సిటీ రిజిస్ట్రార్‌లు న్యాయ విద్యార్థుల ఇంటర్న్ షిప్‌కు సంబంధించిన అవగాహన ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, కార్య శిబిరం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్.ఎల్ జయశ్రీ, హైకోర్టు న్యాయవాది, వర్సిటీ లీగల్ అడ్వైజర్ నర్రా శ్రీనివాసు, డాక్టర్ పీ వెంకటరమణ, డాక్టర్ నూతక్కి సతీష్, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ ఘంటా సతీష్ కుమార్, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, బి.వి.చెన్నారావు, పరుచూరు కుమారి, ఆంగ్ల అధ్యాపకులు, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ అభిలాష్ గోపీనాథన్, ఇందిరా ప్రియదర్శిని లా కాలేజ్ ప్రిన్సిపాల్ నటరాజ్, వర్సిటీ, అనుబంధ కళాశాలల న్యాయ విద్యార్థులు, వివిధ జిల్లాల బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి

పిన్నెల్లి అనుచరులే భూకబ్జాదారులు : ఎమ్మెల్యే జూలకంటి



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో పిన్నెల్లి కుటుంబం, ఆయన అనుచరులు వేల ఎకరాలను కబ్జా చేశారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వెల్దుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బారులో ఆయన మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అరాచక పాలనలో ఎందరో తమ విలువైన భూములను కోల్పోయారని, వాటిపై సమగ్ర విచారణ జరిపి కబ్జాకోరులను జైలుకు పంపి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కులాలను రెచ్చగొట్టేలా రాజకీయాలు చేస్తే తాట తీస్తామని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. తాజాగా మాచర్ల పట్టణంలో రెండు కులాల మధ్య జరిగిన గొడవను రాజకీయంగా ఉపయోగించుకోవాలని వైసీపీ చూడడం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాను నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు కబ్జాకోరులు రావద్దని, బాధితుల కోసమే ఈ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాదర్బార్‌కు 50కుపైగా వినతులు వచ్చాయి. రెవెన్యూ, భూకబ్జాలు, పింఛన్లు, సీఎం రిలీఫండ్ వంటి అనేక సమస్యలపై ప్రజలు తమ అర్జీలు ద్వారా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి విన్నవించారు. తక్షణమే విచారణ జరిపి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

గురుకుల జూనియర్ కళాశాలలో
అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కోస్తా ఆంధ్రాలోని ముస్లిం మైనార్టీ విద్యార్థులకు గుంటూరులో ఏర్పాటు చేసిన గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీ సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఆర్‌జేసీసెట్ ద్వారా విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. ఇందులో ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40, సీఈసీలో 35 సీట్లు ఉంటాయని తెలిపారు. మైనార్టీ ముస్లిం విద్యార్థులతోపాటు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఒక్కో గ్రూపులో రిజర్వేషన్ ప్రకారం సీట్లు ఉంటాయని తెలిపారు. పదవ తరగతి పరీక్ష ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి అర్హత ఉన్న వారు https://aprs.apcfss.in అనే వెబ్‌సైట్ ద్వారా ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 8712625073, 9652569140లో సంప్రదించాలని సూచించారు.

నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ మౌలాలి బైపాసు నుంచే రూటుమార్పు

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వారంలో రెండు రోజులు గుంటూరు మీదగా రాకపోకలు సాగిస్తున్న నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌ని మౌలాలి బైపాసు నుంచే రూటుమార్చి నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 17231 నరసపూర్ - నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28వ తేదీ నుంచి చర్లపల్లికి రాత్రి 8.30కి చేరుకొని 8.40కి బయలుదేరుతుంది. ఈ రైలు సికింద్రాబాద్‌కు వెళ్లకుండా మౌలాలి బైపాసు రూట్ నుంచి కామారెడ్డి మీదగా మరుసటి రోజు ఉదయం 9.45కి నాగర్‌సోల్ చేరుకొంటుంది. నంబరు. 17232 నాగర్‌సోల్ - నరసపూర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29వ తేదీ నుంచి సికింద్రాబాద్‌కు కాకుండా చర్లపల్లికి రాత్రి 11.45కి చేరుకొని 11.55కు బయలుదేరుతుందన్నారు.

సాంకేతికతను రైతుల వద్దకు తీసుకెళ్లాలి

● ఐకార్, ఐఏఆర్ఐ డైరెక్టర్, వైస్ చాన్సలర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు

గుంటూరు(విద్య),మార్చి 15(ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో అభివృద్ధి అయిన సాంకేతికతను వ్యవహారికంగా రైతుల వద్దకు తీసుకెళ్లాలని న్యూఢిల్లీలోని ఐకార్, ఐఏఆర్ఐ (ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్) డైరెక్టర్, వైస్ చాన్సలర్ డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీ రిలేషన్స్‌ల ఆధ్వర్యంలో "అకడమియా ఇండస్ట్రీ ఫార్మర్ పార్టనర్‌షిప్స్ కాన్‌క్లేవ్"ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ ఐఐఓపీఆర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్)ల మధ్య అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్ పెదవేగిలోని ఐఐఓపీఆర్ డైరెక్టర్ డాక్టర్ కే సురేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి అనేక విద్యాసంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు కూడా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు తగ్గ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, సంగం సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆలపాటి సత్యనారాయణ, హైదరాబాద్‌లోని ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సీ తారా సత్యవతి, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్, చెరుకుమల్లి శ్రీనివాసరావు

రెండు వర్గాల మధ్య ఘర్షణ..
13 మంది అరెస్టు.. 14 రోజుల రిమాండ్

మాచర్లటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం రాత్రి రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నమోదైన కేసుల్లో పట్టణ పోలీసులు ఇరువర్గాలకు చెందిన 13 మందిని శుక్రవారం అరెస్టు చేశారు. వారిలో ముగ్గురు మైనర్లు ఉండడంతో వారిని విజయవాడలోని జువైనల్ కోర్టుకు పంపారు. మిగిలిన పది మందిని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి సెలవులో ఉండడంతో స్థానిక తహసీల్దార్ కిరణ్‌కుమార్ వద్ద శనివారం హాజరుపరిచారు. కిరణ్‌కుమార్ వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. వీరిలో ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు హత్యాయత్నం, మరికొన్ని కేసులు కూడా నమోదు చేశారు. మిగిలిన వారిపై హత్యాయత్నం కేసు, మరికొన్ని కొట్లాట కేసులు నమోదు చేశారు. వీరందరిని పోలీసు బందోబస్తు మధ్య గురజాల సబ్‌జైల్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఎన్ఎస్పీ ఏఈ మృతి

బొల్లాపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లటూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎం రమణయ్య(52) మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. రమణయ్య గుంట్లపల్లి ఎన్ఎస్పీ కాలువ ఏఈగా పని చేస్తున్నారు. విధులు నిర్వహించుకుని తిరిగి వస్తుండగా శుక్రవారం రాత్రి ట్రాక్టర్‌ను ఢీకొనటంతో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం వినుకొండ తరలించగా మృతిచెందాడు. మృతునికి భార్య హనుమాయమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 519.50 అడుగులు ఉంది. ఇది 148.36 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులు, ఎస్ఎ ల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,277 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	91, 99, 110
చికెన్ విత్ స్కిన్(కిలో)	176.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	186.00

సీఎం చంద్రబాబు
రాజకీయ జీవితం ఆదర్శనీయం

● ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య



మంగళగిరి సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయాలను ప్రజలందరికీ సమానంగా అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి రాజకీయ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. ఎమ్మెల్యేగా సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసి శనివారంతో 47 సంవత్సరాలు పూర్తిచేసుకోవడం పట్ల అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యేగా 41 ఏళ్లు, ముఖ్యమంత్రిగా 15 ఏళ్లు పూర్తిచేసుకున్నారని చెప్పారు. ఈ రికార్డు ఏపీ చరిత్రలోనే ప్రథమ స్థానమన్నారు. విజన్-2020 నిజమై లక్షలాది ఉద్యోగాలు కల్పించిందని, సంపద సృష్టించిందని తెలిపారు. నేడు స్వర్ణాంధ్ర విజన్-2047తో పౌరుల తలసరి ఆదాయం రూ.35 లక్షలకు పెంచేందుకు అహర్నిశం కృషి జరుగుతుందని చెప్పారు. సామాజిక న్యాయానికి మారుపేరు చంద్రబాబు అన్నారు. విద్య, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్ల కల్పన, డ్వాక్రా వ్యవస్థను దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారని పేర్కొన్నారు. నాడు దీపం-1 పథకం ద్వారా 65 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు దీపం-2 ద్వారా 93 లక్షల ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారని చెప్పారు. పాడి పరిశ్రమలో, ఐటీలో అధిక శాతం మంది మహిళలు ఉపాధి, ఉద్యోగాలు పొందుతున్నారంటే అది చంద్రబాబు కృషేనన్నారు. ఏజెన్సీల్లో జగన్ గంజాయి మొక్కలు పెంచితే... చంద్రబాబు కాఫీ తోటలు పెంచారని, అరకు కాఫీని ప్రపంచ వ్యాపితం చేశారని అబద్దయ్య తెలిపారు.

ఏడాది ముందుగానే
కావటి రాజీనామా

రేపటికి మేయర్‌గా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు

కమిషనర్, కూటమి నేతలపై ఆరోపణలు, విమర్శలు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ మనోహర్‌నాయుడు తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని కలెక్టర్ నాగలక్ష్మికి అందజేస్తున్నట్లు ఆయన శనివారం తెలిపారు. గుంటూరు సంపత్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతుందంటూ కూటమి నాయకులపై ధ్వజమెత్తారు. కమిషనర్ పులి శ్రీనివాస్‌పై ఆరోపణలు చేశారు. నాలుగేళ్ల నగర మేయర్‌గా పనిచేసిన కాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాజీనామా చేస్తున్న క్రమంలో కన్నీటి పర్యంతమయ్యారు. జగన్ వెంట ఉంటానని తెలిపారు.

ఓటమి భయంతోనే..

మనోహర్‌నాయుడు మేయర్‌గా బాధ్యతలు చేపట్టి ఈ నెల 17వ తేదీకి నాలుగేళ్లు పూర్తి అవుతుంది. ఈ నేపథ్యంలో 18న అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కూటమి నేతలు రంగం సిద్ధం చేశారు. ఈ విషయాన్ని ముందే తెలుసుకున్న మనోహర్‌నాయుడు ఓటమి భయంతో పదవికి రాజీనామా చేశారని తెలుస్తోంది. నాలుగేళ్ల తర్వాత అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఎన్నికల నియమావళి ప్రకారం అవకాశం ఉన్నది. ఇప్పటికే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఆరు స్థానాలను కూటమి తరఫున కార్పొరేటర్లు కైవసం చేసుకున్నారు. అప్పటి నుంచి మేయర్ పీఠాన్ని హస్తగతం చేసుకునేందుకు కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారు. ఈ క్రమంలోనే కావటి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో మూడు పర్యాయాలు కార్పొరేటర్‌గా ఆయన పని చేశారు. 2021లో జరిగిన ఎన్నికలలో కార్పొరేటర్‌గా గెలుపొందిన ఆయన మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి నాలుగేళ్లు గుంటూరు మేయర్‌గా వ్యవహరించారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

వ్యాపారుల సౌలభ్యం కోసం గ్రీన్ వెండింగ్ జోన్స్ ఏర్పాటు

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా గుంటూరు నగరంలో వీధి వ్యాపారుల సౌలభ్యం, సంక్షేమం కోసం గ్రీన్ వెండింగ్ జోన్ ఏర్పాటు చేశామని, వీధి వ్యాపారులపై దోపిడీకి అడ్డుకట్ట వేస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలిసి స్థానిక గుజ్జనగుండ్ల మహిళా పాలిటెక్నిక్ కళాశాల దగ్గర వీధి వ్యాపారుల వెండింగ్ జోన్ ప్రారంభించి, గుర్తింపు కార్డులు అందించారు. కమిషనర్ మాట్లాడుతూ తొలి విడతగా పాలిటెక్నిక్ కాలేజి వద్ద 56 మంది వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందించామని, దశాలవారీగా నగరంలో వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పశ్చిమ ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ వీధి వ్యాపారుల జీవనోపాధికి భంగం కలగకుండా, ప్రజలకు అందుబాటులో ఉండేలా వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, కార్పొరేటర్లు మానం పద్మశ్రీ, ఈ.వరప్రసాద్, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఉపా సెల్ పిఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.


గుర్తింపు కార్డులను అందజేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే మాధవి

రోడ్ల విస్తరణకు ప్రజలు సహాయ సహకారాలు అందించాలి

గుంటూరు నగరంలో రోజు రోజు కు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యల దృష్ట్యా రోడ్ల విస్తరణ పనులు నిర్వహించుటకు స్థానిక ప్రజలు సహాయ సహకారాలు అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజలను కోరారు. శనివారం కౌన్సిల్ సమావేశ మందిరంలో వసంతరాయపురం ప్రధాన రహదారి, నెహ్రూనగర్ ప్రధాన రహదారి విస్తరణకు సంబంధించి గృహాలు మరియు స్థలాలు కోల్పోతున్న స్థానిక ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, వసంతరాయపురం ప్రధాన రహదారిని డొంకరోడ్డు నుంచి శారద కాలనీ ఆర్చి సెంటర్ వరకు, నెహ్రూనగర్ ప్రధాన రహదారిని నెహ్రూనగర్ రైల్వే గేటు నుంచి సంజీవయ్య నగర్ రైల్వే గేటు వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగుల రోడ్డుగా విస్తరించాల్సి ఉందన్నారు. గృహాలు, స్థలాలు కోల్పోతున్న ప్రజలకు నగదు రూపంలో నష్టపరిహారం, స్థలం కోల్పోతున్న వారికి టీడీఆర్ బాండులను అందజేయుట జరుగుతుందన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్, ఏసీపీ మల్లికార్జునరావు, టీపీఎస్ లక్ష్మణస్వామి, ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు, పాల్గొన్న డీఎస్‌వో కోమలి పద్మ తదితరులు

సేంద్రియ ఉత్పత్తులను వినియోగించాలి

● జిల్లా ఆహార సహాయ నియంత్రణాధికారి పూర్ణచంద్రరావు

గుంటూరు(తూర్పు), మార్చి 15(ఆంధ్రజ్యోతి): కాఫీ, టీ, ధరించే దుస్తుల వరకు సేంద్రీయ ఉత్పత్తులను వినియోగించడం వల్ల వన్య ప్రాణులు, పర్యావరణంపై తక్కువ కాలుష్య ప్రభావం పడుతుందని జిల్లా ఆహార సహాయ నియంత్రణాధికారి పూర్ణచంద్రరావు అన్నారు. కలెక్టరేట్, డీఆర్సీ సమావేశంలో శనివారం ప్రపంచ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థిరమైన జీవన శైలిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలను సేంద్రియ పద్ధతిలో పెంచడంతో పురుగు మందులను నివారించవచ్చని అన్నారు. డీఎస్‌వో కోమలి పద్మ మాట్లాడుతూ కాలుష్యాన్ని నియంత్రించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములుకావాలని అన్నారు. బ్యాక్టీరియాలజిస్ట్ శోభారాణి, జిల్లా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాజు, స్థానిక జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్, చదలవాడ హరిబాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ తత్వాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలి

● ప్రొఫెసర్ అబ్దుల్ నూర్ బాషా

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బోధించు... సమీకరించు... పోరాడు అనే అంబేడ్కర్ తాత్విక సారాన్ని అర్థం చేసుకోవడంతో పాటు ప్రజలందరూ ఆచరించాలని రిటైర్డు ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా అన్నారు. బహుజన పొలిటికల్ సెంటర్ కో-ఆర్డినేటర్ సాధు మాల్యాద్రి రచించిన 'ఇండియాలో ఇప్పుడేం చేయాలి' అనే పుస్తకాన్ని శనివారం బ్రాడీపేట 2/7వ లైనులోని సీపీఎం భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజలు బుద్ధుడు, అంబేడ్కర్ ఆశయాలతో అభివృద్ధి చెందాలన్నారు. న్యాయవాది, బీసీ సంఘం నాయకులు వైకే మాట్లాడుతూ ఇండియాలో ఇప్పుడేం చేయాలి పుస్తకంలో రచయిత మాల్యాద్రి అన్ని అంశాలను స్పృశించారన్నారు. పుస్తక రచయిత సాధు మాల్యాద్రి మాట్లాడుతూ కుల, వర్గ రహిత, అంతరాలు లేని సమాజం కోసం తత్త్వవేత్తలు, మేధావులు కదిలి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పలు సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, బత్తుల విల్సన్, గుంటూరు నర్సయ్య, కొరివి వినయ్ కుమార్, ఎస్‌వి విద్యాసాగర్, కూరపాటి సుబ్బారావు, పల్నాటి శ్రీరాములు, కే పర్వతాలు, పీ ప్రసాదు, జే శ్రీనివాస్, ప్రత్యూష సుబ్బారావు, పాటిబండ్ల నాగేశ్వరరావు, సీ భాస్కరరావు, కొల్లికొండ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

రైతాంగానికి ఇండియన్ బ్యాంక్ సేవలు ప్రశంసనీయం

● పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

గుంటూరు(తూర్పు), మార్చి 15(ఆంధ్రజ్యోతి): శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన ఇండియన్ బ్యాంక్ గ్రామీణ రైతాంగానికి అన్ని విధాల చేయూతనందించటం అభినందనీయమని సంగం డెయిరీ ఛైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో శనివారం ఇండియన్ బ్యాంక్‌తో సంఘం డెయిరీ అవగాహన ఒప్పంద పత్రం చేసుకున్నారు. అనంతరం ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పాడిపరిశ్రమ అభివృద్ధికై ఇండియన్ బ్యాంకు ముందుకు రావడం పాడి రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఇండియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ వి చంద్రశేఖరన్ మాట్లాడుతూ సంగం డెయిరీ యాజమాన్యంతో కుదుర్చుకున్న ఒప్పందంతో పాడి రైతులకు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేయబడతాయని చెప్పారు. కార్యక్రమంలో సంగం డెయిరీ ఫైనాన్స్ మేనేజర్ సాంబశివరావు, ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ జి రాజేశ్వరరెడ్డి, అమరావతి, విజయవాడ ప్రాంత మేనేజర్లు డిఎస్ మూర్తి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇండియన్ బ్యాంక్ అధికారులతో ఒప్పందం చేసుకుంటున్న ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, పాల్గొన్న బ్యాంకు సిబ్బంది


అధికారులు. నాయకులతో ప్రతిజ్ఞ చేస్తున్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్


ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న కమిషనర్, ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా తదితరులు

ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలు సహకరించాలి

● పెదకాకాని వై జంక్షన్ వద్ద పరిశుభ్రత కార్యక్రమం

● హాజరైన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

పెదకాకాని, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను ప్రమాదంగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ని సంపూర్ణంగా నిషేధించడంలో ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారం జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జీఎంసీ ఆధ్వర్యంలో పెదకాకాని రోడ్డు వై జంక్షన్ దగ్గర జరిగిన జాతీయ రహదారి పరిశుభ్ర కార్యక్రమంలో కేంద్ర మంత్రితో పాటు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ, జీఎంసీ డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రజారోగ్యానికి క్యాన్సర్ వంటి వ్యాధుల కారకంగా అత్యంత ప్రమాదకరంగా మారిందని, ప్రజలు, ప్రభుత్వం సంయుక్త కార్యాచరణ ద్వారానే దీనిని అడ్డుకోగలమన్నారు. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. నగర కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా ప్రజలను, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేస్తూ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టామన్నారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు, అధికారులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి, జాతీయ రహదారి వెంట వ్యర్థాలను వారితో కలిసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రిహాన పఠాన్, భారతి, పి.సమత, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, భాష్యం రామకృష్ణ, సిమ్స్ భరత్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఏప్రిల్ ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

● కాలువలు క్లీన్ చేసిన ఎమ్మెల్యే మాధవి, కమిషనర్

గుంటూరు నగరంలో ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంపూర్ణ నిషేదం అమలు చేస్తామని, నగర ప్రజలు, వ్యాపార సంస్థలు ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పులి శ్రీనివాసులుతో కలిసి స్థానిక జేకేసీ కాలేజి నుంచి గుజ్జనగుండ్ల జంక్షన్ వరకు విద్యార్థులతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన ర్యాలీ జరిగింది. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా ప్రజలకు, వ్యాపార, వాణిజ్య సంస్థలకు ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే ప్రమాదాలపై అవగాహన కలిగిస్తామన్నారు. ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా గుడ్డ, జూట్ సంచులను వినియోగించవచ్చని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు, అధికారుల సమష్టి కృషితోనే ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడం సాధ్యమవుతుందన్నారు. ర్యాలీని తొలుత ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించి, అనంతరం గుజ్జనగుండ్ల జంక్షన్ వద్ద స్వచ్ఛ ప్రతిజ్ఞ చేసి, స్తంభాలగరువు రిజర్వాయర్ పరిసరాల్లో వ్యర్థాలు, పిచ్చి మొక్కల తొలగింపు, లక్ష్మీపురం సీతారామయ్య స్కూల్ పక్కన పీకల వాగులో పూడికతీత పనులను చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వి.శ్రీరామ్ ప్రసాద్, మానం పద్మశ్రీ, ఈ.వరప్రసాద్, డిప్యూటి మేయర్ షేక్ సజీలా, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఉపా సెల్ పిఓ రామారావు, ఎస్ఎస్ సోమశేఖర్, చైతన్య కాలేజి ఏజీఎం దుర్గా ప్రసాద్, జేకేసీ కాలేజి ప్రిన్సిపాల్ గోపీ చంద్ పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో...

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో టీడీపీ సీనియర్ నాయకుడు షేక్ రషీద్ శనివారం స్వచాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి సూచనకనుగుణంగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం పరిసరాలు ఊడ్చి శుభ్రం చేసినట్లు ఆయన తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం అంటే నగరాన్ని ప్లాస్టిక్ రహిత గుంటూరుగా మార్చాలన్నారు.

స్వచ్ఛతతోనే మంచి ఆరోగ్యం: డీఆర్‌డీఏ పీడీ

గుంటూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతతోనే ప్రజలకు మంచి ఆరోగ్యం లభిస్తుందని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి చెప్పారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం డ్వాక్రా మహిళలు, గ్రామ, మండల, జిల్లా సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన సచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్లాస్టిక్ బ్యాగులకు బదులుగా, గుడ్డ సంచులను పంపిణీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదంపై సిబ్బందితో ప్రమాణం చేయించారు.


స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ

గుంటూరులో త్వరలో రెండో ప్రభుత్వాస్పత్రి!

● రూ.93 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం

● శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి పెమ్మసాని


కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు మెడికల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నిత్యం నాలుగు వేలకు పైగా ఓపీ రోగులతో కిటకిటలాడుతున్న గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిపై రోగుల రద్దీ తగ్గించేందుకు త్వరలో బొంగరాలబీడులో జీజీహెచ్‌కు అనుబంధంగా మరొక ప్రభుత్వాస్పత్రిని నిర్మించబోతున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. బొంగరాలబీడులో ప్రభుత్వాస్పత్రి కోసం కేటాయించిన ఆరు ఎకరాల స్థలంలో రూ.93 లక్షల వ్యయంతో చేపడుతున్న ప్రహరి నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఇటీవల జరిగిన ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశంలో బొంగరాలబీడులోని ఆరు ఎకరాల ప్రభుత్వాస్పత్రి స్థలానికి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో ఎన్నారై వైద్యుల సహకారంతో రూ.100 కోట్లతో చేపట్టిన మాతా శిశు ఆరోగ్య సంరక్షణ భవనం త్వరలో అందుబాట్లోకి రానున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, నగర కమిషర్ పులి శ్రీనివాసులు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, అడ్మినిస్ట్రేటర్ బీ ప్రవీణ్‌కుమార్, కార్పొరేటర్ పోతురాజు సమత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

బొంగరాలబీడు కార్మిక శాఖ స్థలాన్ని పరిశీలించిన డాక్టర్ పెమ్మసాని

గుంటూరు కార్పొరేషన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బొంగరాలబీడులోని లేబర్ డిపార్టుమెంట్ స్థలాన్ని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తో కలిసి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ స్థలాన్ని స్థానికులకు, ప్రజలకు ఉపయోగపడేలా పార్కు, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుకుంటున్నారని ఆయన అన్నారు. గత 5 ఏళ్ల పాలనలో జగన్మోహన్‌రెడ్డి ఈ స్థలాన్ని కూడా తాకట్టుపెట్టి రుణాలు తీసుకోవాలని ప్రయత్నించారు కానీ కుదరలేదన్నారు. ఈ స్థలాన్ని జీఎంసీకి అందజేసేలా ప్రణాళికలు రచిస్తున్నామని, కచ్చితంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతామని పెమ్మసాని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల,స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మద్దిరాల మ్యాని, కార్పొరేటర్ పోతురాజు సమత పాల్గొన్నారు.

ఆటోనగర్ రైల్వేగేట్...

పెదకాకాని, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ ఫస్ట్ ఫేజ్ నుంచి గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డుకు కలిపే విధంగా రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని కేంద్రమంత్రి డాక్టర్ పెమసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆటోనగర్లో శనివారం రైల్వే గేట్ ను పరిశీలించారు. డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ లెవెల్ క్రాసింగ్-3 వద్ద నిర్మాణ పనులు ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయి. శంకర్ విలాస్ బ్రిడ్జి, ఇన్నర్ రింగ్ రోడ్డు ఆర్‌ఓబి రెండు వంతెనల పనులు ఒకే సమయంలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందువల్ల నగరవాసులకు ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రత్యామ్నాయ రహదారికి తక్షణ ప్రాతిపదికన రోడ్డు నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అధికారులు నాగ మల్లేశ్వరరావుని ఆదేశించారు. ప్రతిపాదిత రహదారి ఆటోనగర్ తొలి దశ నుంచి రైల్వే లెవెల్ క్రాసింగ్ 3 మీదుగా అగతవరప్పాడు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు అనుసంధానం కానుందన్నారు. కేవలం ఒక కి.మీ. మేర రహదారి పనులను పూర్తి చేస్తే ట్రాఫిక్ మళ్లింపులో భాగంగా ప్రజలకు ఈ రోడ్డు అందుబాటులోకి రానున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం

గుంటూరు(తూర్పు), మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ అగ్రహారం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణం మహోత్సవం శనివారం భక్తి ప్రపత్తులతో జరిపారు. సాయంత్రం వేళలో స్వామివారి రథోత్సవం భక్తుల గోవింద నామస్మరణ మధ్య ప్రధాన వీధులలో సాగింది. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అనంతరం కల్యాణాల్లో భాగంగా శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. మహా హారతి, మంత్రపుష్పం, కల్యాణంలో పాల్గొన్న దంపతులకు శ్రీ విద్యారణ్య భారతి స్వామి వారు పసుపు, కుంకుమలను అందజేశారు. కార్యక్రమాల్ని ఆలయ ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాదు, ధర్మకర్త మర్రిపాటి పార్థసారధి పర్యవేక్షించారు.

17న గోమాతలకు సీమంతం

స్థానిక గోరంట్ల, పద్మా వతి అండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో(పెద్దగుడి) 17న గోమాతలకు సీమంతం, ఆవుదూడలకు బారసాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ కంచర్ల అంజనేయులు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అన్నమాచార్య సంకీర్తనలతో, బారసాల గేయాలతో, భజన, భరతనాట్యం ఇతర కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. 116కు పైగా ప్రసాదాలను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు.

మాజీ ప్రియుడి వేధింపులపై ఫిర్యాదు

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : గతంలో దిగిన ఫొటోలు, వీడియోలు బయటపెడతానని ఓ యువతిని వెంటపడి వేధింపులకు పాల్పడుతున్న మాజీ ప్రియుడు మంచాల రాజుపై అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా, సింగరాయకొండ మండలం, పాకాల గ్రామానికి చెందిన ఓ యువతి ప్రస్తుతం బ్రాడీపేటలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉండి స్థానికంగా ఉన్న ఓ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. గతంలో ఏసీ కాలేజీలో చదివే క్రమంలో ఆమె క్లాస్‌మేట్ అయిన మంచాల రాజుతో పరిచయమై ఇరువురు ప్రేమించుకున్నారు. ఆ తరువాత అతనికి వేరే అమ్మాయిలతో సంబంధాలు ఉన్నాయని తెలుసుకొని పెద్దల సమక్షంలో విడిపోయారు. అప్పటి నుంచి సదరు రాజు ఆ యువతి మీద కక్ష పెంచుకొని వెంటపడటం, పని చేసే దగ్గరికి వచ్చి గొడవ పెట్టుకోవటం చేస్తున్నాడు. గతంలో అతనితో దిగిన ఫొటోలు, వీడియోలు అన్నీ బయట పెడతా అని బెదిరించటం చేస్తూ వేధిస్తున్నాడు. దీంతో బాధిత యువతి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని టీజేపీఎస్ కళాశాల ఎదురుగా గల మసీదు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 55-60 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వ్యక్తి మసీదు గోడ పక్కన ఉన్న అరుగు మీద కూర్చున్న వ్యక్తి కూర్చున్నట్లుగానే చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు రుద్రా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మార్చురీకి తరలించారు. మృతదేహాన్ని గుర్తించిన వారు పట్టాభిపురం ఎస్సైకు 8688831344లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

చంద్రబాబు రాజకీయ ప్రస్థానం... స్ఫూర్తిదాయకం

● పశ్చిమ ఎమ్మెల్యే మాధవి



గుంటూరు(తూర్పు), మార్చి 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రస్థానం నేటి నాయకులకు స్ఫూర్తిదాయకమని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. శాసన సభలో తొలిసారి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసి నేటికి 47 ఏళ్ళు అయిన సందర్భంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి హర్షం వ్యక్తం చేసి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ జీవితంలో చంద్రబాబు ఎన్నో త్యాగాలు చేశారని అన్నారు. శ్రమదానం, ప్రజల వద్దకు పాలన, జన్మభూమి, పచ్చదనం-పరిశుభ్రత, గ్రామీణ మహిళల ఆర్థిక అభ్యున్నతికి డ్వాక్రాసంఘాల ఏర్పాటు, రైతుబజార్ల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు ఆయన హయాంలోనే జరిగాయని అన్నారు. ఆయన స్థాపించిన స్వయం సహాయక సంఘాలు గ్రామీణ పేద మహిళల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాయన్నారు. రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం, ఎస్సీ వర్గానికి చెందిన జీఎంసీ బాలయోగిని లోక్‌సభకు స్పీకర్‌గా చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ప్రభుత్వం ఒక్క రూపాయి అవసరం లేకుండా రాజధాని అమరావతి నిర్మాణానికి రైతుల నుంచి భూసమీకరణ విధానంలో రెండు నెలల్లోనే 33వేల ఎకరాలు సమీకరించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

జగన్ రాజకీయాల నుంచి తప్పుకోవాలి

● డేగల ప్రభాకర్



గుంటూరు(తూర్పు), మార్చి 15(ఆంధ్రజ్యోతి): వైసీపీకి రాజకీయ పార్టీగా కొనసాగే నైతిక హక్కు లేదని, జగన్ స్వతంత్రంగా రాజకీయాల నుంచి తప్పుకుంటే మంచిదని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ హితవు పలికారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో అరాచకవాదులకు తావులేదన్నారు. రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తే ప్రభుత్వం చూస్తూ ఉరుకోదని హెచ్చరించారు. ప్రజలే జగన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా ఒక మూలన కూర్చోబెడితే, ప్రతిపక్ష హోదా కావాలని ఎలా అడుగుతారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికలలో ప్రజలే జగన్‌రెడ్డి పార్టీకి ఒక్క సీటు కూడా రాకుండా తగిన బుద్ధి చెబుతారని అన్నారు. జగన్ రెడ్డికి ఉన్న ధన దాహంతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేశాడని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను భ్రష్టు పట్టించిందని, ప్రభుత్వం దానిని గాడిలో పెడుతుందన్నారు. మరో ఆరు నెలల్లో అభివృద్ధి ఊపందుకుంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా ఆదివారం డి 12 సెక్షన్ పరిధిలోని లాలుపురం, వై జంక్షన్ ప్రాంతాలతో పాటు ఆయా పరిసర ఏరియాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ రాజమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వాలు వినియోగదారులకు రక్షణ కల్పించాలి

గుంటూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు అనేక సందర్భాల్లో మోసాలకు గురవుతోన్న నేపథ్యంలో ప్రభుత్వాలు పకడ్బందీ చట్టాలతో రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడాలన్నా, వాణిజ్య వ్యవస్థలు నిలదొక్కుకోవాలన్నా వినియోగదారుడే కీలకమన్నారు. సమావేశంలో న్యాయవాది ముప్పాళ్ళ ప్రసాదరావు, సదాశివం, మల్లేశ్వరరావు, జనార్ధనరావు తదితరులున్నారు.

19 నుంచి ఈశా ఫౌండేషన్ ఇన్నర్ ఇంజనీరింగ్ తరగతులు

గుంటూరు(తూర్పు), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థ ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక టీజేపీఎస్ కళాశాలలో ఈ నెల 19 నుంచి 25 వరకు ఇన్నర్ ఇంజనీరింగ్ అనే ఏడు రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈశా వలంటీర్ సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్నర్ ఇంజనీరింగ్ అనేది సద్గురు రూపకల్పన చేసిన ఒక పరివర్తన కార్యక్రమమని, ఇందులో సులభమైన యోగ సాధనలు, సెషన్లు, సద్గురు సూచనలతో రూపొందించిన ప్రక్రియలు ఉంటాయన్నారు. శాంభవి మహాముద్ర క్రియ అనే శక్తివంతమైన 21 నిమిషాల యోగ సాధన ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 98851 98095 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి


శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు




చంద్రబాబు దంపతులకు హారతి ఇస్తున్న వేద పండితుడు




పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు


శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు


చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు


మంగళసూత్రాలు చూపుతున్న వేద పండితులు


కల్యాణం తిలకిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి ఆనం, బీఆర్ నాయుడు


కల్యాణం తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి నారాయణ


కల్యాణాన్ని తిలకిస్తున్న పీఠాధిపతులు


వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు


కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేలు పుల్లారావు, ఆనందబాబు, రామాంజనేయులు తదితరులు

గడువులోగా రైతుల సమస్యలు పరిష్కరించాలి

విజయవాడ ప్రధాన కార్యాలయంలో సమస్యలపై సమీక్ష

ప్రాధాన్య క్రమంలోనే గ్రామ కంఠాల సమస్య పరిష్కారం

● సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు

తుళ్లూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి) రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించడానికే సీఆర్డీఏ తొలి ప్రాధాన్యమిస్తుందని సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు అన్నారు. శనివారం విజయవాడ లెనిన్ సెంటర్ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ ప్రవీణ్ చంద్‌తో కలసి ఆయన గ్రీవెన్స్ పోర్టులో రైతులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతుల సమస్యలు తెలుసుకొని, సంబంధిత అధికారులతో చర్చించారు. గడువులోగా పరిష్కరించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. మొత్తం గ్రీవెన్స్ పోర్టులో 93 సమస్యలు నమోదు కాగా రైతులందరిని పిలిచి మాట్లాడారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం జరిగే గ్రీవెన్స్ డే తో పాటుగా ప్రతి శనివారం విజయవాడ సీఆర్డీఏ ఆఫీసులో తానే స్వయంగా సమస్యలపై సమీక్ష నిర్వహిస్తానని కమిషనర్ తెలిపారు. రైతుల నుంచి నేరుగా కాకుండా ఆన్‌లైన్ విధానంలో కూడా ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. దరఖాస్తు అందినప్పటి నుంచి అది పరిష్కారమయ్యే దాక ఎప్పటికప్పుడు రైతు ల ఫోన్లకు మేసేజ్ వెళ్తుందని చెప్పారు. పలువురు రైతులు గ్రామ కంఠం భూముల సమస్యల గురించి ప్రస్తావించగా వాటిని ప్రాధాన్య క్రమంలో వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ అధికారులు డీసీలు, తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు సర్వేయర్లు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ ప్రవీణ్‌చంద్

సికింద్రాబాద్‌కు బదులుగా చర్లపల్లికి రైళ్ల మళ్లింపు

విజయవాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ స్టేషన్‌లో అభివృద్ధి పనుల కారణంగా తొమ్మిది రైళ్లను దారి మళ్లించి చర్లపల్లి స్టేషన్‌లో నిలిపేందుకు రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుందని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు పనులను చేపట్టినట్టు వివరించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ప్లాట్‌ఫారం, తదితరాలు రాకపోకలకు అనువుగా లేని కారణంగా రైళ్ల రాకపోకలను చర్లపల్లి నుంచి ఆపరేట్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కామారెడ్డి, వయా మౌలాలి బైపాస్ రూట్ నుంచి డైవర్షన్ అవుతాయని చెప్పారు. రైలు నెం.20809, 20810 శంబల్ పూర్-నాందేడ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25, 26 తేదీల్లో చర్లపల్లిలో ఆగుతాయన్నారు. ఇదే క్రమంలో 20811, 20812 విశాపట్నం-హెచ్ఎస్ నాందేడ్, విశాఖపట్నం ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26, 27 తేదీల్లో చర్లపల్లి నుంచి ఆపరేట్ అవుతాయి. 18503, 18504 విశాఖపట్నం-సాయినగర్ షిరిడీ-విశాఖపట్నం వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 24, 25తేదీల్లో, 12787, 12788 నరసాపూర్-నాగర్‌సోల్-నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 25, 26 తేదీల్లో చర్లపల్లి స్టేషన్‌లో ఆగుతాయి. 17231, 17232 నరసాపూర్ - నాగర్‌సోల్ - నరసాపూర్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 28, 29 తేదీల్లో చర్లపల్లి నుంచి ఆపరేట్ అవుతాయి. సికింద్రాబాద్ - బేగంపేట మీదుగా నడిచే రైళ్లు కొన్ని చర్లపల్లి టూ సనత్‌నగర్, లింగంపల్లి వయా అమ్ముగూడ బైపాస్ రూట్‌లో వెళతాయి. 17208, 17207 సాయినగర్ షిరిడీ-మచిలీపట్నం ఏప్రిల్ 22, 23 తేదీల్లో, 17206, 17205 కాకినాడ పోర్టు-సాయినగర్ షిరిడీ ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 23, 24 తేదీల్లో, 18519, 18520 విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినల్ ముంబయి-విశాఖపట్నం డైలీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 24, 22 తేదీల్లో మౌలాలీ, సికింద్రాబాద్ స్టేషన్లలో ఆగకుండా చర్లపల్లి, సనత్‌నగర్, లింగంపల్లి, వయా అమ్ముగూడ బైపాస్ రూట్‌లో నడుస్తాయన్నారు.

జడ్పీటీసీలు.. బాయ్‌కాట్

(5వ పేజీ తరువాయి)

సంఘ సమావేశాలకు కోరం లేకపోవడంతో వాటిని వాయిదా వేశారు. మధ్యాహ్నం జరి గే సర్వసభ్య సమావేశానికి జడ్పీటీసీలు వస్తారులే అని అందరూ అనుకున్నారు. అయితే మధ్యాహ్నం 2.30 గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభం కాగా అతితక్కువ మందే హాజరయ్యారు. దీంతో తొలుత గంటసేపు వాయిదా వేశారు. అప్పటికే సమావేశా నికి హాజరైన ఎమ్మెల్సీ లక్ష్మణరావు, బాపట్ల జేసీ ప్రభాకర్‌జైన్, పల్నాడు జేసీ సూరజ్‌ధనుంజయ్, ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అధికారులు ప్రజాప్రతినిధుల కోసం ఎదురు చూశారు.

ఎమ్మెల్యేలు వస్తారని..

ఎమ్మెల్యేలు సమావేశానికి వచ్చే అవకాశం ఉందని చైర్‌పర్సన్ తొలుత ప్రకటించారు. దీంతో ఎమ్మెల్యేలందరూ హాజరైనా కోరం సరిపోతుందని అందరూ ఊహించగా వారు కూడా సమావేశానికి గైర్హాజరయ్యారు. వాయిదా సమయం ముగిసిన తర్వాత కూడా జడ్పీటీసీలు సమావేశానికి హాజరుకాలేదు. జడ్పీలో మొత్తం 82 సభ్యులు ఉండగా(ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు కలిపి) కేవలం 13 మంది మాత్రమే హాజరయ్యారు. కోరం కావాలంటే 27 మంది సభ్యులు ఉండాలి. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు చైర్మన్ ప్రకటించారు.

బడ్జెట్ ఆమోదానికి అడ్డంకులు

శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో 2025-2026 అంచనా బడ్జెట్‌ను ఆమోదించాలి. రూ.643.80 కోట్లతో అధికారులు బడ్జెట్‌ను రూపొందించి ఆమోదం కోసం పాలకవర్గం ముందుకు తీసుకువచ్చారు. బడ్జెట్ ఆమోదం పొందితేనే రానున్న ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయింపు, చెల్లింపులు, ఖర్చులకు అవకాశం ఉంటుంది. అయితే జడ్పీటీసీలు సమావేశానికి రాకపోవడంతో బడ్జెట్ ఆమోదానికి నోచుకోలేదు. ఫలితంగా ఏప్రిల్ 1 నుంచి జడ్పీ చెల్లింపులు నిలిచిపోతాయని అధికారులు చెబుతున్నారు.


సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా

జడ్పీటీసీల దారిమళ్లింపు..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో వైసీపీకే పూర్తి మెజార్టీ ఉంది. చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా కూడా ఆ పార్టీకి చెందిన వారే కాగా ఎన్నికల ముందు ఆమె భర్తతో కలిసి టీడీపీలో చేరారు. ఆ తర్వాత జరిగిన రెండు సమావేశాలకు జడ్పీటీసీలు హాజరయ్యారు. వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా అంబటి రాంబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత జడ్పీటీసీలను ఇటీవల జగన్ వద్దకు తీసుకువెళ్లినట్లు సమాచారం. జడ్పీ విషయాల్లో సహాయ నిరాకరణ పాటించాలని జడ్పీటీసీలను జగన్ ఆదేశించినట్లు తెలుస్తుంది. అయినా జడ్పీ సమావేశానికి హాజరయ్యేందుకు జడ్పీటీసీలు సిద్ధం కాగా వారిని వైసీపీ నేతలు పిలిపించి అడ్డుకున్నట్లు సభ్యులు చెబుతున్నారు. వారితో నేతలు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి అక్కడే భోజనాలు కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం.

గతంలో ఎన్నడూ లేదు...

గతంలో ఎన్నడూ లేని రాజకీయ పోకడ జడ్పీలో కనిపిస్తుంది. ప్రభుత్వాలు మారిన తర్వాత బలాబలాలు అటూఇటూ అయినా ఏ నాడు జడ్పీ సమావేశాలను బహిష్కరించిన దాఖలాలు లేవు. సమావేశాలకు జడ్పీ టీసీలు హాజరై సమస్యలపై నిలదీసేవారు. ప్రస్తుతం ఆ సంప్రదాయం మంట గలిసిందని ఇలా సమావేశాలు బాయ్‌కాట్ చేస్తే ప్రజా సమస్యల పరిష్కారం ఎలా అన్న ప్రశ్న ఎదురవుతోంది. దళిత మహిళ చైర్‌పర్సన్‌గా ఉండగా వైసీపీ ఇటువంటి రాజకీయ ఎత్తుగడలు వేయడం విమర్శలకు తావిస్తోంది. హెనీక్రిస్టీనా టీడీపీలోకి మారిన తర్వాత జరిగిన తొలి సమావేశంలో కూడా వైసీపీ ఇదే రీతిగా వ్యవహరించి విమర్శలు ఎదుర్కొన్నది. బడ్జెట్ ఆమోదంపై ఏర్పాటు చేసిన కీలక సమావేశంలోనూ అదే పంథాను ఎంచుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

మిర్చిలో అధిక మోతాదులో నెమ్ము శాతం

● ఆర బెట్టకుండా తీసుకొస్తున్న బళ్ళారి, హుబ్లీ, హోస్‌పేట రైతులు

● వాటి శాంపిల్స్ చూస్తూనే ఎగుమతిదారుల వెనకడుగు

● ధర పెరగకపోవడానికి ఇదే ప్రధాన కారణం

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు తీసుకొస్తున్న ఎండుమిరపకాయలలో నెమ్ము శాతం ఎక్కువ మోతాదులో ఉంటున్నది. పంట కోసిన తర్వాత కనీసం 20 రోజుల పాటు కళ్ళాల్లో ఎండబెట్టి తీసుకురావాల్సిన ఆ రాష్ట్ర రైతులు 10 రోజులకే తీసుకొస్తున్నారు. కొందరైతే కోసిన రోజునే కాయలు తీసుకొస్తున్నారని వ్యాపారస్థులు, అధికారులు చెబుతున్నారు. యార్డుకు నిత్యం 1.50 లక్షల నుంచి 1.80 లక్షల మిర్చి టిక్కీలు(40 కేజీలవి) వస్తుండగా వాటిల్లో 80 నుంచి 85 శాతం వరకు నెమ్ము అధిక మోతాదులో ఉంటుందని చెబుతున్నారు. ఇది ప్రత్యక్ష్యంగా ధరలు పెరగకపోవడానికి కారణంగా మారుతున్నది. తేమ శాతం తక్కువగా ఉన్న మిరపకాయలు వస్తుంటే ఈ పాటికే క్వింటాల్ ధర రూ. 16 వేలకు చేరుకొని ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

రెండు వారాల క్రితం సీఎం చంద్రబాబు వద్ద మిర్చి వ్యాపారస్థులతో సమావేశం జరిగిన తర్వాత ధర క్వింటాల్‌కు రూ. 15 వేల వరకు చేరుకొన్నది. ఇక రైజింగ్ అవుతుందని అంతా భావించారు. ప్రభుత్వం కూడా మిర్చికి కనీస మద్దతు ధర ప్రకటించడంతో వ్యాపారస్థుల్లో పోటీ తలెత్తుతుందని, దాంతో రైతులకు మేలు జరుగుతుందని అంచనా వేశారు. అయితే కర్ణాటకలోని బళ్ళారి, హోస్‌పేట, హుబ్లీ నుంచి రైతులు తీసుకొస్తున్న మిర్చి టిక్కీలలో నెమ్ము శాతం అధికంగా ఉండటమే కాకుండా తాలు కూడా ఎక్కువ మోతాదులో ఉంటుంది. దాంతో ఎగుమతిదారులు పోటీపడి వాటిని కొనుగోలు చేయడం లేదు. దీంతో ధర తగ్గుతున్నది. ప్రస్తుతం వివిధ రకాల మిర్చి సగటు ధర రూ. 12 వేల నుంచి రూ. 13 వేల మధ్యనే ఉంటున్నది. కొన్ని టిక్కీలు అమ్ముడుపోకపోతుండటంతో రైతులు కమీషన్ వ్యాపారస్థుల దుకాణాల వద్దనే ఆరుబయట ఆరబోస్తున్నారు. దీని వలన యార్డులో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నది.


నెమ్ము శాతం అధికంగా ఉండటంతో యార్డులోనే మిర్చిని ఎండబోసిన రైతులు

20 రోజులైనా ఎండబెట్టుకుని తీసుకురావాలి
ఏ చంద్రిక, మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి



ఈ విషయం మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రికకు కమీషన్, ఎగుమతి వ్యాపారస్థులు నివేదించడంతో ఆమె మూడు రోజుల నుంచి అధికారులను ఆయా దుకాణాల వద్దకు పంపించి పరిశీలన చేయించారు. కర్ణాటక రైతులు తీసుకొస్తున్న మిర్చిలో ఎక్కువగా తేమ శాతం ఉందని అధికారులు నివేదిక ఇవ్వడంతో సెక్రెటరీ మైకులో రైతులకు విజ్ఞప్తి చేయించారు. మిర్చిని పొలం వద్దనే కనీసం 20 రోజులు ఎండబెట్టుకొని తీసుకురావాలని సూచించారు. అప్పుడు అధిక ధరకు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఇలా తగినంత ఆరబెట్టకుండా తీసుకురావడం వలన అది మార్కెట్‌పై ప్రభావం చూపుతుందని చెప్పారు. ఈ విషయాన్ని రైతులంతా గమనించాలని విజ్ఞప్తి చేశారు.

నృసింహాలయంలో వైభవంగా చూర్ణ, వసంతోత్సవం

మంగళగిరి సిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీ నృసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఆలయ అర్చకులు ధ్వజ అవరోహణం చేసి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టాలకు ముగింపు పలికారు. అంతకుముందు ఉదయం ఆలయంలోని శ్రీకృష్ణదేవరాయ ముఖ మండపంలో నృసింహస్వామి, శ్రీదేవీ, భూదేవీ అమ్మవార్లకు సంప్రదాయంగా



నృసింహునికి చూర్ణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

చక్రవారి చూర్ణోత్సవం, వసంతోత్సవాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉభయ నాంచారులు, శ్రీస్వామివార్ల ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం చేయిస్తూ కల్యాణ పుష్కరిణి (పెదకోనేరు) వద్ద గల ఆంజనేయ స్వామి దేవస్థానానికి తీసుకువెళ్లి ఉత్సవమూర్తులకు చక్రస్నానం చేయించారు. ఈ ఉత్సవానికి నిడమర్రుకు చెందిన కొమ్మా రెడ్డి బ్రహ్మానంద రెడ్డి, ఛాయాదేవి దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. రాత్రి ధ్వజ అవరోహణం అనంతరం సంప్రదాయంగా నృసింహస్వామిని కేళీగుర్రంపై పురవిహారం చేయించారు. ఈ ఉత్సవానికి బెంగళూరుకు చెందిన బుల్లా రుక్మిణీరావు, మంగళగిరికి చెందిన దేవతి భగవన్నారాయణ, పద్మజ దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఉత్సవాలను ఆలయ ప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు నిర్వహించగా, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

● ఎంఈవో కేవీఫ్ కెన్నడీ

కాకుమాను, మార్చి 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో కేవీఫ్ కెన్నడీ అన్నారు. మండలపరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను శనివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాల గురించి వాకబు చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తరగతి గదుల్లో వెనకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఒంటి పూట బడులు నిర్వహణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ



నూతన ధ్వజస్తంభానికి గ్రామోత్సవం

తాడికొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తాడికొండలోని శ్రీగిరీ శ్వరస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఉదయం 9గంటలకు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ధ్వజ స్తంభంతో పాటు బలిపీఠ శ్రీకాల భైరవ సహిత విగ్రహాన్ని పునఃప్రతిష్ఠలను చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికై నూతన ధ్వజ స్తంభానికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్థులు ధ్వజస్తంభానికి నీళ్ల పారించి కొబ్బరికాయలు కొట్టి గ్రామంలోకి అంగరంగ వైభవంగా తీసుకువచ్చారు.

జెమ్స్‌లో కేజీ గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులు

మంగళగిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కాజ గ్రామ పరిధిలోని జెమ్స్ పబ్లిక్స్ స్కూల్లో అంతర్జాతీయ స్థాయి బాకలారియేట్ విద్యా విధానంలో ప్రీ ప్రైమరీ విద్యను ముగించుకుని ప్రైమరీ విద్యకు ప్రవేశం పొందుతున్న చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రేడ్-1 నుంచి గ్రేడ్-2కు ప్రవేశం పొందిన 64 మంది విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసన్న జాయ్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజర్ మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయులు రైజా, ఛాయా, నీలిమ, రేవతి, కోఆర్డినేటర్ రుబీనా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలిచ్చే వరకు పోరాటం : జంగాల

మంగళగిరి సిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ నివేశన స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ చెప్పారు. ఇంటి స్థలాల కోసం అర్జీదారులతో కలిసి శనివారం మంగళగిరి సీపీఐ కార్యాలయం నుంచి ఎంటీఎంసీ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అక్కడ కొద్దిసేపు నిరసన తెలియజేసి లబ్ధిదారులతో కలిసి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ అర్హత కలిగిన పేదలందరికీ ఇంటి నివేశన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నివాస యోగ్యం కాని ప్రాంతంలో పేదలకు ఇంటి స్థలాలను కేటాయించి దారుణంగా మోసం చేసిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు అసలు ఎక్కడ ఉన్నాయో కూడా లబ్ధిదారులకు తెలియదన్నారు.

ఏడాదిలో చెత్తరహిత నగరంగా మంగళగిరి

● అన్ని సచివాలయాల పరిధిలో ఇక స్పెషల్ డ్రైవ్
● అదనంగా మరో 70మంది పారిశుధ్య కార్మికులు
● ప్రజల్లోనూ చైతన్యం రావాలన్న నారా లోకేశ్

మంగళగిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏడాదే లక్ష్యం.. ఎంటీఎంసీని చెత్తరహిత నగరంగా మార్చివేద్దామని విద్య, ఐటీ శాఖలమంత్రి నారా లోకేశ్ మంగళగిరి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ స్వచ్ఛ మంగళగిరి ఉద్యమంలో నియోజకవర్గ ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఎంటీఎంసీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. ప్రతి ఇంటి నుంచి వెలువడే వ్యర్థాల నిర్వహణ బాధ్యతను ఆ ఇంటి వారే తీసుకుంటే మన లక్ష్యం త్వరగా నెరవేరిపోతుందన్నారు. ఇంటి నుంచి వచ్చే చెత్తను బహిరంగ ప్రదేశాల్లోనో, ఇళ్ల పక్క కనిపించే ఖాళీ స్థలాల్లోనో, మురుగు కాలువల్లోనో పారవేయకుండా ప్రతిరోజు మన ఇంటి ముందరకు వచ్చే నగరపాలక సంస్థ వాహనాలకు అందజేయాలన్నారు. తాను ఎమ్మెల్యేగా విజయం సాధించాక నియోజకవర్గాన్ని స్వచ్ఛ మంగళగిరిగా మార్చాలన్న ఉద్దేశంతో స్వచ్ఛత కార్యక్రమానికి శ్రీకారం చుట్టానన్నారు. తాను కోరిన వెంటనే సెయిల్, దివీస్ సంస్థలు సీఎస్ఆర్ నిధుల కింద నిధులను ఇచ్చి స్వచ్ఛ మంగళగిరి ఉద్యమానికి త



స్వచ్ఛ మంగళగిరి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్

మవంతు సహకారాన్ని అందించారన్నారు. సెయిల్ సంస్థ రూ.1.25 కోట్ల వ్యయంతో అన్ని సచివాలయాలకు శానిటేషన్ కిట్స్‌ను అందజేయగా, దివీస్ సంస్థ స్వచ్ఛ అంబాసిడర్‌లకు జీతాలను చెల్లించేందుకు ముందుకు వచ్చాయంటూ ఆయా సంస్థలను అభినందించారు. వచ్చే ఏడాదిలోగా మంగళగిరి దేశంలోనే చెత్తరహిత నగరంగా రూపొందాలన్నారు. అంతేకాదు.. మంగళగిరిలో ఎటు చూసినా ఆహ్లాదకర వాతావరణమే కనిపించాలన్నారు. ఇందుకోసం స్థానికంగా పార్కులను ఏర్పాటు చేస్తామన్నారు. చెరువులను కూడ ఆధునికీకరించి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. తల్లిదండ్రులు కూడ చిన్నప్పటి నుంచే తమతమ పిల్లలకు పరిశుభ్రతపై అవగాహనను పెంచే విధంగా కృషి చేయాలన్నారు.

వచ్చే నెలరోజులపాటు నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలో ప్రత్యేక డ్రైవ్ ప్రోగ్రామ్ ద్వారా పారిశుధ్యంపై ఇంటింటికి అవగాహనను కల్పించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు మంత్రి లోకేశ్ ప్రకటించారు. ఇందుకోసం అన్ని సచివాలయాల పారిశుధ్య సిబ్బందికి కిట్స్‌ను అందజేయడంతోపాటు అదనంగా మరో 70 మంది కార్మికులను కూడ తాత్కాలిక పద్ధతిలో నియమిస్తామని లోకేశ్ తెలిపారు.

తొలుత ఎంటీఎంసీ కార్యాలయానికి విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మొదట మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ రహిత స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. అనంతరం పారిశుధ్య ప్రాధాన్యం గురించి డ్రాయింగ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆ తరువాత స్వచ్ఛ మంగళగిరి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆ తదుపరి ఏడాదిలోగా మంగళగిరిని స్వచ్ఛ మంగళగిరిగా మారుస్తామంటూ అధికారులు, నాయకులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనరు షేక్ అలీంబాషా, అదనపు కమిషనరు ఎం శకుంతల, డిప్యూటీ కమిషనరు శ్రీకాంత్, టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, ఆకుల జయసత్య, తమ్మిశెట్టి జానకీదేవి, వింజమూరి ఆషాబాల, తోట పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వనాలుగా గ్రామాలు విలసిల్లాలి



ఫిరంగిపురం బస్టాండ్ వద్ద ఊడుస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

ఫిరంగిపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : సామాజిక వనాలుగా గ్రామాలు విలసిల్లాలి ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. శనివారం ఫిరంగిపురంలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ భారత్ కార్యక్రమ సభలో ఆయన మాట్లాడా రు. ప్లాస్టిక్ వల్ల వాతావరణానికి, భూమికి, జీవ మనుగడకు ప్రమాదకరమని, కనుకనే ప్లాస్టిక్ రహిత మండలంగా ఉండాలని ఆయన చెప్పారు. దేశంలోనే మేఘాలయ రాష్ట్రంలోని గ్రామం పుష్పాలతో నిండి స్వచ్ఛ గ్రామంగా ఉందన్నారు. అలాగే తెలంగాణా రాష్ట్రంలో గంగ దేవరపల్లి కూడా స్వచ్ఛ గ్రామ అవార్డు పొందిందన్నారు. సర్పంచ్‌లు ప్రభుత్వానికి అభి వృద్ధిలో కలసి రావాలన్నారు. ముందుగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోను, పోలీసుస్టేషన్‌లోను స్వయంగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ చీపురు పట్టి ఊడ్చారు. ప్రధాన వీధిలోని ప్రతి దుకాణం దారు వద్దకు వెళ్ళి ప్లాస్టిక్ కవర్లు వాడకూడదని, వాడితే జరిమానా విధిస్తారని, వాతావరణాన్ని అందరూ కలసి కాపాడు కోవాలని ఆయన కోరారు. ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు తప్పనిసరిగా జరగాలని ఆయన పార్టీ శ్రేణులను, అధికారులను ఆదేశించారు. అనంతరం బస్టాండ్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపల్లి కోటేశ్వరరావు, మండవ నరసింహారావు, పసల థామస్, పీ హృదయరాజు, ఆరే పున్నారెడ్డి, కే యో హాన్, గోలి బాలజోజి, కే అప్పారావు, సర్పంచ్‌లు మేడా బాబు, పీ కేశవరావు, ఈవో ఏ కిషోర్‌బాబు, డీఈ రామ కృష్ణారావు, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

● డీపీవో బీవీ సాయికుమార్

తాడికొండ(పొన్నెకల్లు), మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా ప్రజలు తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి బీవీ సాయికుమార్ పేర్కొన్నారు. శనివారం పొన్నెకల్లులో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ రోజు రోజుకు ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుందన్నారు. ప్లాస్టిక్ సంచులు పక్కన పడేసి క్లాత్ సంచులను వినియోగించాలని కోరారు. అనంతరం పొన్నెకల్లు చెరువు గట్టుపై మొక్కలను నాటడం, వర్మీ కంపోస్టు అమ్మకం, ఐటీసీ బంగారు భవిష్యత్, ఫినిష్ సొసైటీ తరుపున క్లాత్ మిత్రాలకు గ్లౌజులు, యాప్రాన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు డివిజనల్ పంచాయతీ అధికారి కే.శ్రీనివాసరావు, తహసీల్దార మెహర్‌కుమార్, ఈవోపీఆర్డీ కే సాయిలీల, డీసీ చైర్మన్ గుంటుపల్లి మధుసూదనరావు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర

మంగళగిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరి సహకారం, భాగస్వామ్యం ఉంటేనే స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్ అన్నారు. స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్రలో భాగంగా పెదవడ్లపూడిలో శనివారం పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కిరణ్‌చంద్ మాట్లాడుతూ పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యేళ్ల శివరామయ్య, మాదల రమేష్‌బాబు, అన్నే చంద్రశేఖర్, బోయపాటి రమేష్, కఠారి సాంబయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర... స్వచ్ఛదివస్ కార్యక్రమంలో బాగంగా మండల గ్రామ వీధుల్లో ఫ్లెక్సీ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్దిదిద్దుదామంటూ పారిశుధ్య కార్మికులు, హైస్కూల్ విద్యార్థులు, అధికారులతో కలిసి ప్లకార్డులు చేతపట్టుకుని నెలలో మూడో శనివారం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. దుకాణాలు, హోటళ్లు, వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి క్యారీ బ్యాగ్‌లను వినియోగించ వద్దని, టీకాఫీలకై ప్లాస్టిక్ కప్పులను, డిస్పోజబుల్ గ్లాసులను వాడినట్లైతే క్యాన్సర్ బారినపడే అవకాశ ముందంటూ అవగాహన కల్పించారు. సంపదషెడ్లలో తయారు చేసిన వర్మీ కంపోస్టును ఎంపీ



ఈమనిలో సంపద షెడ్‌లో తయారుచేసిన వర్మి కంపోస్టును శ్రీఅనితకు అందిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

డీవో చేతుల మీదుగా గ్రామస్థులకు అందించారు. ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్, టీడీపీ మండల అధ్యక్షురాలు కే శ్రీఅనిత, టీడీపీ నాయకులు జీ వెంకట్రావు, వీ నరసింహారావు, ఎన్ చిరంజీవి, సర్పంచులు కుషీబాయి, శ్రీవాణి ఉజ్వల హరిణి, మాణిక్యం. మండల ఉపాధ్యక్షురాలు పీ సాయిచైతన్య, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లి (కుంచనపల్లి), (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థలో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమం సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ సిబ్బంది నేతృత్వంలో నిర్వహించారు. విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయ పరిధిలో ఎండీ కూర్మనాథ్ సిబ్బంది వినియోగించి వదిలేసిన ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, వస్తువులను తొలగించారు.

స్వచ్ఛత, పారిశుధ్యంపై ప్రజల్లో మార్పు రావాలని

● మండల ప్రత్యేకాధికారి కేజీవీఎస్ విజయలక్ష్మి

పెదనంపాడు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత, పారిశుధ్యంపై ప్రజల్లో మార్పు రావాలని మండల ప్రత్యేకాధికారి కేజీవీఎస్ విజయలక్ష్మి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో శనివారం అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని, ప్లాస్టిక్ నిర్మూలనతో పాటు తడిపొడి చెత్తలను వేరుగా సేకరించడం, మురుగు కాలువల్లో వ్యర్థాలు వేయరాదని తెలిపారు. అనంతరం దుకాణాల వద్దకు ప్లాస్టిక్ గ్లాసులు, సంచులు వినియోగదారులకు ఇవ్వరాదని సూచించారు. పాతబస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్వహించి, చేయిచేయి కలుపుదాం, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌ను సాధిద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీటీ కరీముల్లా, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, కార్యదర్శి శ్వేత, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



పాతబస్టాండ్ సెంటర్లో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ప్లాస్టిక్ రహిత గ్రామానికి సహకరించాలి

● ఎంపీడీవో యుగకీర్తి

కాకుమాను, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే ప్లాస్టిక్ నిషేధం సాధ్యమవుతుందని ఎంపీడీవో యుగకీర్తి అన్నారు. మండలపరిధిలోని బీకే పాలెంలో స్వచ్ఛభారత్ మిషన్ స్వచ్ఛాంధ్రలో కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో యుగకీర్తి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. అలాగే స్వచ్ఛ గ్రామాలు వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత కూడా పాటించాలని తెలిజేశారు. ప్లాస్టిక్ వలన ప్రజలకే కాకుండా పశువులు కూడా హాని కలుగుతుందన్నారు. భూగర్భ జలాలు సంరంక్షిచుకోవాలంటే ఇంకుడు గుంటలు అవసరమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మెరిగల శాంతకుమారి, ఈవో పీఆర్డీ రవిబాబు, ఏపీవో సింగారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, హౌసింగ్ ఏఈ మారుతిరావు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..



కోతకు గురైన కొప్పర్రు - అన్నపర్రు రహదారి

పెదనంపాడు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : కొప్పర్రు-అన్నపర్రు రహదారిలో అన్నపర్రు గ్రామశివారులోని ప్రధాన రహదారి కోతకు గురైంది. దీంతో ప్రయాణికులు అటుగా వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. గ్రామంలోని మురుగునీరు వాగులోకి పోయేందుకు అక్కడ ఇన్‌లెట్ నిర్మాణం చేపట్టారు. గతంలో వచ్చిన వరదలకు పూర్తిగా రహదారి కోసుకుపోయి లోయలాగా ఏర్పడింది. పలుమార్లు అధికారులకు సమస్య విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. అక్కడ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేటి నుంచి ఉచిత యోగా శిబిరం

మంగళగిరి సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గీతా యోగా ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఉచిత యోగా శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్టు యోగా గురూజీ పంచుమర్తి సత్యనారాయణ తెలిపారు. మంగళగిరి తెనాలి రోడ్డులోని మార్కండేయ పద్మశాలీయ కల్యాణ మండపం మొదటి అంతస్తులో ఈ నెల 16వ తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 5 నుంచి 6:30 గంటల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్, మోకాళ్ల నొప్పులు, గ్యాస్ ట్రబుల్ వంటి జబ్బులకు ఉపశమనంతో పాటు సూర్యనమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం, ఆధ్యాత్మిక విషయాలు, ఆహార నియమాలను బోధించడం జరుగుతుందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కేఎల్‌యూలో కోడింగ్ టెక్నాలజీపై వర్క్‌షాపు



కోడింగ్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్న సాయి శంకర కేశవానంద పండా

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో స్టూడెంట్ యాక్టివిటీస్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రాంప్టో వెంచర్ క్లబ్ ద్వారా కోడింగ్ టెక్నాలజీపై ఒకరోజు కార్యశాలను శనివారం నిర్వహించారు. ఈ కార్యశాలకు ప్రముఖ కోడింగ్ నిపుణులు (యూట్యూబర్) సాయి శంకర కేశవానంద పండా ముఖ్యఅతిథిగా హాజరై కోడింగ్ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కోడింగ్, ప్రోగ్రామింగ్, పైథాన్, జావా, సీ ప్లస్ ప్లస్, జావా స్క్రిప్ట్ వంటి పలు రకాల కోడింగ్‌ల ప్రాముఖ్యతను వివరించారు. కోడింగ్ ప్రయోజనాలు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, బ్లాక్ చెయిన్ కూడా నేర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాక్ డైరెక్టర్ సాయివిజయ్, ఆర్గనైజర్ కృష్ణసాయి, అసిస్టెంట్ ప్రొఫెసర్ బి రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకాల్వకు 1316 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1316 క్యూసెక్కుల సాగునీటిని శనివారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.7 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్‌చానల్‌కు 46, రేపల్లెకాల్వకు 110, తూర్పుకాల్వకు 97, పశ్చిమ కాల్వకు 133, నిజాంపట్నంకాల్వకు 68, కొమ్మమూరుకాల్వకు 800 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రత్తిపాడు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని పాతమల్లాయపాలెంలో ఎన్ఆర్ఈజీఎస్, 15వ ఆర్థిక సంఘం, పంచాయతీ రాజ్ నిధులు 21.45లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు కొబ్బరికాయ కొట్టి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి తాగునీటి చెరువులను ఉపాధిహామీ పథకం ద్వారా అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఎస్సీలకు ఉచితంగా సోలార్ సిస్టం ద్వారా విద్యుత్, బీసీలకు 80శాతం సబ్సిడీతో అందించడం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియోజకవర్గానికి ఇచ్చిన హామీ మేరకు నిధులు కేటాయించడంపై సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గుంటూరు ఛానెల్ పొడిగింపుతో పాటు ఆధునికీకరణకు కూడా 465 కోట్లు నిధులు కేటాయించి, త్వరలో పనులు చేపడతామని తెలిపారు. తొలుత గ్రామంలోని పురాతన దేవస్థానం శ్రీప్రసన్నాంజనేయ దేవాలయంలో ఎమ్మెల్యే దంపతులు ఆకు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పలు సమస్యలపై గ్రామస్థులు నుంచి పలు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి, గ్రామ అధ్యక్షుడు శశిరెడ్డి, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, మాజీ జడ్పీటీసీ దక్కుమళ్ల భాగ్యారావు, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నాయకులు అమర్తలూరు బసవబాబు, నాయకులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రావణ్

అమీనాబాద్(ఫిరంగిపురం), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీనాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు పౌర సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో వారు విధిగా పాల్గొనాలన్నారు. ఆకస్మిక తనిఖీలు జరుపుతామని, ఎవరైనా గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామన్నారు. రూ.46.50 లక్షలతో నిర్మించిన భవన సముదాయాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలోని తండాలో స్కూల్ ఉండేలా చూడాలన్నారు. అలాగే గ్రామం నుంచి మల్కా చెరువు వరకు సీసీ రోడ్డు నిర్మించాలని, రాములవారి మాన్యంకు నష్టపరిహారం ఇప్పించాలని స్థానిక పెద్దలు ఎమ్మెల్యేను వినతిపత్రం ద్వారా కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కొరివి చిన ఆనంద్, డీఈ కొండయ్య, ఎంపీటీసీ అనురాధ, కొత్తపల్లి కోటేశ్వరరావు, మండవ నరసింహారావు, బత్తుల వేణుగోపాల్ బాబు, బత్తుల రమేష్, కాకర్ల మురళీకృష్ణ, కటికల రామకోటేశ్వరరావు, పచ్చల రత్నరాజు, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని సేవలో ఉపలోకాయుక్త రిజిస్ట్రార్



దిగువ సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న ఉపలోకాయుక్త రిజిస్ట్రార్ రజని దంపతులు

మంగళగిరి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపలోకాయుక్త రిజిస్ట్రార్ పీ రజని దంపతులు శనివారం మంగళాద్రి క్షేత్రాన్ని దర్శించారు. తొలుత దిగువ సన్నిధిలో దేవస్థానం సిబ్బంది, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీలక్ష్మీనృసింహస్వామి, శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయశాఖ సహాయ కమిషనరు, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి నృసింహుని చిత్రపటంతో కూడిన జ్ఞాపికను ఉపలోకాయుక్త రిజిస్ట్రార్ రజని దంపతులకు బహూకరించారు.

● కేఆర్ కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారిని రజని దంపతులు శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన వారికి ఆలయ అర్చకులు, ఈవో కోగంటి సునీల్, ఇతర అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అర్చకుడు తారక్‌నాథ్‌శర్మ ఆశీర్వచనం అందించారు. **(దుగ్గిరాల)**

ఘనంగా గోపయ్య స్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జయసత్య తదితరులు

మంగళగిరి సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎర్రబాలెం పారిశ్రామిక వాడ సమీపంలోని శ్రీ గోపయ్య స్వామి సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ 18వ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. స్వామివార్లకు ప్రత్యేక పూజల అనంతరం కల్యాణం నిర్వహించారు. తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు పోలన శ్రీనివాసరావు, సుభాషిణి దంపతులు 18 సంవత్సరాలుగా ఆలయ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల ఉమామహేశ్వరరావు, గడదాసు రంగారావు, ఆకుల పానకాలరావు, తోట సురేష్, కౌతరపు రమేష్, గడదాసు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ ఎదుట బాలిక బంధువుల ఆందోళన

● నిందితుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

మేడికొండూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి యత్నించిన నిందితుడిపై చర్యలు తీసుకోకుండా పోలీసుల నిర్లక్ష్యం వహిస్తున్నారని బాలిక బంధువులు శనివారం రాత్రి మేడికొండూరు పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామానికి చెందిన బాలికపై వృద్ధుడు అత్యాచారయత్నం చేసిన విషయం విదితమే. శుక్రవారం పోక్సో కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని బాలిక బంధువులు ఆరోపిస్తున్నారు. నిందితుడు మండల స్థాయి వైసీపీ ప్రజాప్రతినిధి తండ్రి కావడం వల్లనే పోలీసులు పట్టించుకోవడం లేదని బాలిక బంధువులు చెబుతున్నారు. రాజధాని ప్రాంతంలో జరిగిన సీఎం కార్యక్రమానికి బందోబస్తులో ఉన్న కారణంగా నిందితుడిని అరెస్టు చేయలేకపోయామని, వెంటనే చర్యలు తీసుకుంటామని మేడికొండూరు సీఐ బాలిక బంధువులతో మాట్లాడారు. రాత్రి 12గంటల వరకు వారు ఆందోళన కొనసాగుతూనే ఉంది.

విజయవాడ మహాధర్నాను జయప్రదం చేయాలి

మేడికొండూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో పనిచేసే వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17తేదీన విజయవాడలో జరుగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు షేక్ మహమ్మద్ భాషా కోరారు. పేరేచర్ల పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన పంచాయతీ వర్కర్లతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ వర్కర్లకు జీతాలు పెంచాలని, గ్రీన్ అంబాసిడర్లకు పది వేల రూపాయలు వేతనం ఇవ్వాలని, డిమాండ్ చేశారు. మహాధర్నాలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి: ఎంపీడీవో

కొల్లిపర, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులు చేసే కూలీలు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని అత్తోట, సిరిపురం, చివలూరు, తూములూరు, కొల్లిపర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. కూలీలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి కూలీలు సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ అజయ్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తుల్లిమిల్లి నాగరాజు, సురేష్, స్వాతి, సునీల్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

విద్యార్థులకు ప్యాడ్‌ల పంపిణీ

కొల్లిపర, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అత్తోట జడ్పీ హైస్కూల్లో శనివారం పదో తరగతి విద్యార్థులకు జనసేన నాయకులు దివ్వెల ఏడుకొండలు, దివ్వెల వెంకయ్యనాయుడు ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్స్, స్కేళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు, ఉపసర్పంచ్ దివ్వెల ఏడుకొండలు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు పదో తరగతిపై ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో తైక్వాండో పోటీలు

తెనాలి అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఆత్మకూరు తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా ఇన్విటేషన్ చాంపియన్‌షిప్ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి 259మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అకాడమీ అధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడు అందె బాల చంద్రమౌళి, కోచ్ బట్టు నాగరాజు, బసవయ్య, వాగ్దేవి, ముఖేష్ పర్యవేక్షించారు.

శ్రీవాసవీ ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తెనాలి అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాలలో సుప్రభాతసేవ, నిత్యార్చనలు నిర్వహించారు. విజయగణపతి స్వామికి అభిషేకం, పరివార స్థాపన పూజల్లో కమిటీ కార్యదర్శి వక్కలగడ్డ గంగాధరరావు దంపతులు పాల్గొన్నారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణ, ధ్వజారోహణ, హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కూడా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరగనున్న ఈ ఆలయ ఉత్సవాలలో గోపూజ, మూలమూర్తికి విశేష అభిషేకం, స్వామివారిని పెండ్లి కుమారుని చేసే కార్యక్రమాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్టు

తెనాలి మారీసుపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గంజాయిని సేవిస్తున్న యువకులను టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం స్థానిక వీఎస్‌ఆర్ కళాశాల సమీపంలోని రోడ్డులో గంజాయి సేవిస్తూ సంచరిస్తున్న యువకులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. గంజాయి ఎక్కడ నుండి వస్తుంది, ఎవరి వద్ద కొనుగోలు చేశారు అన్న వివరాలను విచారిస్తున్నారు.

ఖాతాదారుల సంక్షేమమే బ్యాంకుల లక్ష్యం

పొన్నూరుటౌన్(చేబ్రోలు), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా బ్యాంక్‌లు పని చేస్తున్నాయని కెనరా బ్యాంక్ మేనేజర్ గాంధీ అన్నారు. మండలంలోని శలపాడులో శనివారం డిపాజిటర్స్‌కు ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. వివిధ బ్యాంక్‌లు అందిజేస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఖాతాదారులు సామాజికభద్రత పథకాలలో చేరాలని కోరారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంక్‌ల వద్ద రుణ పరపతి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీజీజీబీ, యూకోబ్యాంక్ మేనేజర్‌లు ఉదయ్‌కుమార్, నవీన్, జానకీరామ్, అరుణకుమారి, శిరీష, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత తెనాలిగా తీర్చిదిద్దుదాం

● స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత తెనాలిగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని అన్నాబత్తుని పురవేదిక వద్ద స్వర్ణ అంధ్రా - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో భాగంగా స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ సప్నిల్(అండర్ ట్రైనీ), కమిషనర్ బండి శేషన్న తో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించడం ద్వారా మన భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని, కాలుష్య రహిత సమాజాన్ని అందించవచ్చన్నారు. ప్లాస్టిక్ క్యారీబ్యాగులు, గ్లాసులను, ఇతర ఉత్పత్తులను వినియోగించకుండా క్లాత్ సంచులను వినియోగించుకోవాలన్నారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వలన ప్రజలు క్యాన్సర్ బారినపడే ప్రమాదముందని, భూమి కూడా కలుషితమవుతుందన్నారు. అందుకే సింగల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించామన్నారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను ఒక కిలో అందించిన వారికి ఒక కిలో పంచదార, కిలో టమాట, కిలో సేమ్యా, ఆరు గుడ్లు, అరలీటర్ పాలు వీటిలో ఏదైనా బహుమతిగా తీసుకోవచ్చన్నారు. స్వచ్ఛ తెనాలిలో సాధనలో ప్రతిఒక్కరి భాగస్వామ్యం కావాలన్నారు. స్వచ్ఛ ఆంధ్రా సాధనకు కృషి చేస్తామని అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, కౌన్సిలర్లు గొగిరెడ్డి మానసారెడ్డి, అన్నం పిన్నారావు, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, గొడవర్తి సాయిహరేరామ్, మునిసిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక, పక్కన అసిస్టెంట్ కలెక్టర్ పవార్ సప్నిల్, కమిషనర్ శేషన్న తదితరులు



ఆసుపత్రిలో మాట్లాడుతున్న వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి



మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్న అధికారులు

మలేరియా సిబ్బంది ఆధ్వర్యంలో ...

తెనాలి, మారీసుపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని సహాయ మలేరియా అధికారి కార్యాలయం ఆవరణలో శనివారం స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని మలేరియా, ఫైలేరియా సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి పాల్గొని సిబ్బందితో కలసి కార్యాలయ అవరణలోని పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యానికి బాటలు వేయవచ్చన్నారు. అనంతరం సిబ్బందితో కలసి స్వచ్ఛ ఆంధ్రా సాదిద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మలేరియా, ఫైలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ని నిర్మూలిద్దాం.. పర్యవరణాన్ని కాపాడుకుందాం

● ఆస్పత్రి సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి

తెనాలి రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించి పర్యవరణాన్ని కాపాడుకుందామని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వవైద్యశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ద్వారా ప్లాస్టిక్ వాడకంతో వచ్చే అనర్థాలను వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు ప్రియదర్శిని ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ రీసెర్చి విద్యార్థులు రోగులకు, వారి బంధువులకు ప్లాస్టిక్ వాడకంతో వచ్చే అనారోగ్య సమస్యలు, పర్యవరణానికి కలిగే ముప్పుపై అవగాహన కల్పించారు. అనంతరం ఆసుపత్రి పరిసరాల్లో సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. నర్సింగ్ విద్యార్థులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్ రమాదేవి, పద్మరాణి, వైవీడీ ప్రసాద్ తదితరులు

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకుందాం

● జిల్లా కోఆర్డినేటర్ పద్మరాణి

తెనాలి రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ముప్పుగా మారిన సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలించి స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దుకుందామని జిల్లా కో ఆర్డినేటర్ పద్మరాణి అన్నారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివాకం మండలంలోని పెదరావూరులో ఈవోపీఆర్డీ వైవీడీ ప్రసాద్, గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి, పలు శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి ప్లాస్టిట్ వినియోగంతో కలిగే ప్రమాదాలను వివరిస్తూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మరాణి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, డిస్పోజ్ గ్లాసులు, ఇతర ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం రోజురోజుకు పెరిగిపోయి ప్రమాదకర స్థాయికి చేరాయన్నారు. ప్లాస్టిక్ భూమిలో వేస్తే అది కరగదని, ఎన్ని సంవత్సరాలున్నా అలాగే ఉంటుందని, దీంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంపై ప్రతి ఒక్కరూ దూరంగా ఉంటూ వాటి స్థానంలో చేతి సంచులు, జ్యూట్‌బ్యాగ్‌లను వినియోగించడం అలవాటుచేసుకోవాలన్నారు. ఈవోపీఆర్డీ వైవీడీ ప్రసాద్ మాట్లాడుతూ కర్రీస్ పాయింట్లు, టీ స్టాల్స్‌లో ఎక్కువగా ప్లాస్టిక్ కవర్లలో వేడివేడి కూరలు, పాలు, టీ వంటివి పార్సిల్‌కి వినియోగిస్తున్నారని, వాటిల్లో తీసుకువచ్చిన పదార్థాలు వేడికి కరుగుతాయని, వాటిని తినడం లేదా తాగడం ద్వారా క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉందన్నారు. తొలుత గ్రామంలోని పంచాయతీ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి ప్లాస్టిక్ వాడకం వద్దంటూ నినాదాలతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సెంటర్లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దానయ్య, మండల కోఆర్డినేటర్ దివ్య, బాలరాజు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, డ్వాక్రా మహిళలు, ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో భద్రపర్చిన ప్రశ్నపత్రాలు



కొల్లిపర పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను భద్రపర్చుతున్న అధికారులు

కొల్లిపర, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ప్రశ్నపత్రాలు శనివారం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు మధ్య కొల్లిపర పోలీసుస్టేషన్‌కు చేరుకున్నాయి. సెట్‌నెం.2 ప్రశ్నపత్రాలను రూట్ ఆఫీసర్ సాల్మన్‌రాజు కొల్లిపర పోలీసుస్టేషన్‌లో ట్రంకు బాక్సుల్లో పెట్టి సీలువేశారు. ఎస్‌ఐ కోటేశ్వరరావు రక్షణతో పరీక్ష పత్రాలను కొల్లిపర పోలీసుస్టేషన్‌లో సీఎస్‌కు అందజేశారు. పదో తరగతి పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.

తెనాలి డివిజన్‌లో 54 పది పరీక్షా కేంద్రాలు

తెనాలి అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తెనాలి డివిజన్‌లో పదో తరగతి పరీక్షలకు 54 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామని డీవైఈవో జి.శాంతకుమారి శనివారం తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుండి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. తెనాలి, తాడేపల్లి, పొన్నూరు, మంగళగిరి, కొల్లిపర, కాకుమాను, దుగ్గిరాల, చేబ్రోలు మండలాల్లో 9716మంది విద్యార్థులు, 430మంది గత ఏడాది ఫెయిల్ అయినవారు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు ఉంటుందన్నారు. ఈ కేంద్రాల్లోనే 658 మంది విద్యార్థులు ఓపెన్ స్కూల్ నుంచి పరీక్షలు రాయడానికి కేటాయించామన్నారు. డివిజన్ పరిధిలో ఉన్న 10-సి సెంటర్లకు కస్టోడియన్‌లు ఏర్పాటుచేసి ప్రశ్నాపత్రాలు సకాలంలో అందేలా సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో 15 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు కాగా అందులో 2520 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని ఆమె తెలిపారు.

సుదీర్ఘ రాజకీయానుభవం ఉన్న వ్యక్తి సీఎం

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

కొల్లిపర, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘంగా రాజకీయాల్లో అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం కొల్లిపర టీడీపీ కార్యాలయంలో భీమవరపు అదిశేషమ్మకు రూ.2లక్షల 7వేల 799, భీమవరపు చైతన్యకు రూ.37వేల 378 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదప్రజలు వైద్యం చేయించుకోలేకపోతే సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఆదుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, భీమవరపు లంకకోటిరెడ్డి, గుదిబండి గోవర్ధనరెడ్డి, షేక్ రఫీ పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం

తెనాలి రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అండగా నిలిచారు. మండలంలోని జగ్గడిగుంటపాలెంకు చెందిన గండికోట ఏసుబాబు కుటుంబంతో పూరింట్లో ఉంటూ చిరు వ్యాపారం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అగ్ని ప్రమాదం జరిగి సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. విషయం తెలుసుకున్న ఆలపాటి పార్టీ శ్రేణులతో కలిసి గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించి తక్షణ సాయంగా రూ.10వేలు అందజేశారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం తరుపున సాయమందించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు, అత్తోట తదితర గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కలిగించారు. తహసీల్దార్ కార్యాలయం, రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో అధికారులు పరిశుభ్రం చేసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతే ప్రగతికి మెట్లు అని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అదినారాయణరెడ్డి, ఈవోపీఆర్‌డీ భార్గవ్, డీటీ ఉప్పాల రాజేష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌పై అవగాహన కలిగిస్తున్న అధికారులు

తిరుమలకు కాలినడకన బాలస్వామి

● స్వామీజీతో పాటు మరో 50మంది భక్తులు

తెనాలి అర్బన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి బాలస్వామి తిరుమలకు కాలినడకన యాత్ర చేపట్టారు. గంగానమ్మపేటలోని సాలిగ్రామ పీఠం నుండి శనివారం పాదయాత్ర మొదలుపెట్టారు. పట్టణంలోని ఆలయాలలో పూజలు చేసిన అనంతరం వైకుంఠపురం ఆలయాన్ని దర్శించారు. శ్రీలక్ష్మీపద్మావతీ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు, ఆలయ అధికారులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో పూజల అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. మరో 50మంది భక్తులు స్వామీజీని అనుసరించారు. ఏప్రిల్ 4వ తేదీకి తిరుమలకు చేరుకుని అక్కడ జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. తిరుమల చేరే వరకు పలు ప్రధాన గ్రామాలలో భక్తులు ఏర్పాటుచేసిన శ్రీనివాస కల్యాణంలో పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తారు.



బాలస్వామికి స్వాగతం పలుకుతున్న వైకుంఠపురం అర్చకులు, భక్తులు

ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ పొన్నూరు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరుటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా భాగస్వామ్యంతో పొన్నూరు పట్టణాన్ని స్వచ్ఛ పొన్నూరుగా రూపొందిస్తామని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. శనివారం పొన్నూరు పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ పొన్నూరు కార్యక్రమం నిర్వహించారు. పొన్నూరు పురపాలక సంఘం నుంచి కూరగాయల మార్కెట్ వరకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన కల్పించారు. మామిళ్లపల్లి బస్టాండ్ వద్ద జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే చేతులమీదగా జూటు బ్యాగ్‌ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా జ్యూట్‌బ్యాగ్‌ల పంపిణీకి రూ.3వేలు ఆర్థిక సహాయం అందజేసిన విద్యార్థినులు, స్వచ్ఛ పొన్నూరుకు రూ.5వేలు అందజేసిన వ్యాపారిని అభినందించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతో స్వచ్ఛ పొన్నూరు సాధనకు కృషి చేస్తానన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోస్వచ్ఛ పొన్నూరు కార్యక్రమం జరిగింది. పొన్నూరు, చేబ్రోలు మండలాల్లోని పలు ప్రభుత్వ కార్యాలయాలలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీలు జరిగాయి. ఈ కార్యక్రమాలలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాలల్గొన్నారు.



మురుగుకాలువలో సిల్టు తొలగిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

ప్రజలకు అత్యవసర వైద్యసేవలు అందించాలి

పొన్నూరుటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమైన అత్యవసర వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదేశించారు. శనివారం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న సేవలు, మందుల గురించి ఆరా తీశారు. నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తనిధి కేంద్రం ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ వైద్యులు 24 గంటలు కేటాయించిన విధులలో ఉంటూ ప్రజలకు అత్యవసర వైద్యాన్ని ఆసుపత్రిలోనే అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్‌ఖాన్, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులు

ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి

పొన్నూరుటౌన్(చేబ్రోలు), మార్చి 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలని ఎంఈవో రాయల సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరు జడ్పీ హైస్కూల్లో శనివారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం పరీక్ష కేంద్రాలలో మౌలికవసతులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ సత్యం, ఏ శ్రీనివాసరావు, హెచ్‌ఎం ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్‌పై పునరాలోచించాలి

పొన్నూరుటౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే దిలీప్ శనివారం కోరారు. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమన్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ సిఫార్సులను విస్మరిస్తూ బీజేపీ ప్రభుత్వం ముందుకు వెళుతున్న తీరు అనుమానాలకు తావిస్తుందన్నారు. ముస్లిం పెద్దలు లేవనెత్తిన 14 అంశాలపై పునఃపరిశీలన చేయకుండా బిల్లు పార్లమెంట్‌కు తీసుకురావడం అప్రజాస్వామ్యం అని దిలీప్ ఆరోపించారు.

లడ్డు ప్రసాదాల నిల్వకు 30 ట్రేల బహూకరణ

● దాతలను అభినందించిన ఆలయ ఈవో లీలాకుమార్

పెదకాకాని, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానానికి మాచర్లకు చెందిన మాదాసు చిన్న సాంబశివరావు, సుబ్బలక్ష్మీ దంపతులు వారి కుటుంబసభ్యులతో కలిసి దేవస్థాన ప్రసాదపోటులో లడ్డు ప్రసాదాల నిల్వకు రూ.2.25 లక్షల విలువైన 30 స్టీల్ ట్రేలను శనివారం ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్‌కి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు.



30 స్టీల్ ట్రేలు అందజేస్తున్న దాతలు సాంబశివరావు, సుబ్బలక్ష్మి